# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్: (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
గూడూరి వెంకటరత్నం
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి
మిస్.పి. ఇందిరాదేవి
డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు
డా॥ యమ్.స్వర్ణముఖి

Volume 31 Issue 8
No.of Pages 40
APRILs 2012

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్సుA/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్‌పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్సు పంపవలసిన చిరునామా:
మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో....** **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 4 |
| బాబూజీ ఉవాచ | 6 |
| మాతాజీ అభిభాషణ | 8 |
| సన్నిధిలో సంభాషణ | 10 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 12 |
| భగవంతుడు కులాతీతుడు | 13 |
| గురు కృపాహి కేవలమ్ | 15 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 17 |
| డబ్బు చెడ్డది కాదు | 19 |
| పరిప్రశ్నేన సేవయా | 20 |
| శివానందలహరి | 21 |
| బాబూజీతో అనుభవాలు | 23 |
| నామహోమం విశిష్టత | 25 |
| పురుషోత్తమ ప్రాప్తి యోగం | 27 |
| సమర్థ సద్గురు నాధుని దివ్యచరిత్ర | 28 |
| బ్రహ్మాన్ని పట్టుకుంటే బ్రహ్మమే అవుతావు | 30 |
| అపరోక్షానుభూతి | 32 |
| బెంగుళూరులో శ్రీమాతాజీ సత్సంగం | 34 |
| నంబూరు యాత్ర | 36 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

***విజానన్తి మహావాక్యం గురోశ్చరణ సేవయా ।***
***తే వై సన్న్యాసినః ప్రోక్తా ఇతరే వేషధారిణః ॥***

(గురుగీత శ్లో॥
153)

శ్రీగురుదేవులు ఎవరు నిజమైన సన్న్యాసి అన్న విషయం చాల వివరంగా తెలియ జేశారు.

***కాషాయ దండ మాత్రేన యతి పూజ్యో న సంశయః*** అనే విషయం అందరికీ తెలిసినదే. కాషాయ వస్త్రాలు, రుద్రాక్షలు, కమండలం, దండం ధరించిన వారిని ఎవరైనా గౌరవించటం మానరు కదా! కాని వేషధారణ చేత సన్న్యాసి కాలేడు. సమర్థులైన గురుమూర్తిని ఆశ్రయించి, సేవ చేసి మహావాక్యోపదేశం పొంది, మనస్సులో ఏ రకమైన సంకల్పములుగాని, వికారములుగాని, ఈర్ష్య అసూయలు గాని లేని సమదృష్టి గల విరాగి ఎవరైనా గుర్తించినా, గుర్తించకపోయినా సన్న్యాసి కాకమానడు కదా!

అటువంటి సాధువు ఒకాయన చెట్టు క్రింద ఆసనం ఏర్పరచుకుని ఎవరైనా ఆ దారినపోయే బాటసారులు ఏదైనా యిస్తే స్వీకరించి, చలికాలం, వానాకాలం అనే వివక్షత లేకుండా కాలం గడుపుతున్నాడు.

ఆ ప్రాంతానికి చెందిన మహారాజు అడవికి వేటకి వచ్చినప్పుడల్లా ఆ సన్న్యాసిని దర్శించుకుని ఆయన చెంత మౌనంగా కూర్చుని పండ్లు అందజేసి వెళ్ళిపోయేవాడు. ఒకసారి మహారాజు వేటకి వచ్చినప్పుడు తనతో రాజభవనానికి విచ్చేసి, తన ఆతిథ్యాన్ని స్వీకరించమని కోరిన వెంటనే ఆ సన్న్యాసి ఆయన కోరికను మన్నించి మహారాజు వెంట వెళ్ళాడు. మహారాజుకు ఆశ్చర్యం వేసింది. అయినా ఆ సన్న్యాసికి రాజభవనంలో బస ఏర్పాటు చేసి, ఉదయం ఫలహారం, మధ్యాహ్నం చక్కని భోజనం, మళ్ళీ రాత్రికి చక్కని ఆహారం అందజేశాడు. ఇలా కొన్ని రోజులు గడిచాయి.

రాజుగారికి సన్న్యాసి సచ్ఛీలతపై శంక ఏర్పడింది. తనకి సాధువుకి ఏమీ తేడా లేదని తలపోశాడు. అవకాశం లేకనే సన్న్యాసి అయ్యాడు, అన్నీ లభిస్తే మనలాంటి వ్యక్తే అన్న భావం స్థిరపడింది. ఆ విషయమే మహారాజు

సాధువుతో ప్రస్తావించాడు. ''మనమిద్దరమూ అన్ని భోగాలు అనుభవిస్తున్నాము. మనకిద్దరకి తేడా ఏమీ గోచరించటం లేదు'' అన్నాడు. సాధువు సమాధానాన్ని దాటవేసి, మనమిద్దరమూ రేపు వ్యాహ్యాళికి వెళ్తున్నాం. మీరు కోరిన వివరణ గూర్చి రేపు చర్చిద్దాం అని చెప్పి ఎవరూ వెంట వద్దని యిద్దరూ అడవి మార్గంలో మూడు గంటలు నడక సాగించారు.

చీకటి పడింది. మహారాజుగారికి నీరసం వచ్చింది. వెనుదిరుగుదామని సాధువుకు సూచించారు. సాధువు జవాబు చెబుతూ "మహారాజా! మనం యిప్పుడు రామేశ్వరం వెడుతున్నాం'' అన్నాడు. రాజుగారు ఆశ్చర్యపోతూ "స్వామీ! మీరేమంటున్నారు? ఇక్కడికి రామేశ్వరం రెండు వేల మైళ్ళు. మన వద్ద దుస్తులు లేవు. ధనం లేదు. నేను మంత్రులకు, నా భార్యకు చెప్పి రాలేదు'' అన్నాడు.

సాధువు నవ్వి మహారాజా! ఇప్పుడు తెలిసిందా మీకూ నాకూ తేడా! అన్ని సౌకర్యాలను విడిచి ఒక్క క్షణంలో నేను బయటకి రాగలుగుతాను. ఏదీ నన్ను బంధించ లేదు. నేను సర్వకాల సర్వావస్థలలోనూ అలా ఉండగలను. రాత్రి ప్రయాణం అంటే నీకు భయం. నాకు భయం అనేది లేదు. నిన్ను నగరం వరకు సాగనంపి నా దారిన నేను వెళతాను. భగవంతుడు నీకు మేలు చేయుగాక!'' అని చెప్పి సాధువు నడక సాగించాడు. గురుగీత బోధించిన సన్న్యాసి అటువంటివారు.

**పరాశర ప్రసాద్**
**గౌరవ సంపాదకులు**

## *అమృత బిందువులు*

తాబేలు నీటిలో ఉండి తన బిడ్డలకు తలచుకోగానే ఆహారాన్ని అందిస్తుంది కదా! మరి జగన్మాతకు తన బిడ్డల అవసరాలు తెలియవా?

* * * * * *

వాచార్థంలోని జీవుడే లక్ష్యార్థంలోని ఈశ్వరుడు

* * * * * *

మనం భుజించిన ఆహారాన్ని వమనం చేసుకుంటే ఎంత అసహ్యకరమో! ఈ ప్రాపంచిక భోగాలు అంతే!

\- శ్రీకాళీబాబు

# అమ్మ ఆశీస్సులు

***శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం***
***సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం***
***ఆజానుబాహుం అరవింద దళయతాక్షం***
***రామం నిశాచర వినాశకరం నమామి ॥***

శ్రీగురుదేవులు రామాలయానికి వెళ్ళినప్పుడు తప్పకుండా శ్రీసీతారామ ఆంజనేయ, లక్ష్మణుల సన్నిధిలో పాడించేవారు ఈ పద్యాన్ని. ఈనెల మొదటి రోజునే శ్రీరామ నవమి వచ్చింది. ఇంతకు ముందే సంవత్సారాది "నందన" నామంతో అడుగు పెట్టింది. ఆ నందనందనుని లీలలోని భాగమే కదా!

ఇదంతా ఎవరైతే ***కాలశ్చ నారాయణః*** కాలము నారాయణుడే అన్న సత్యమును గుర్తిస్తారో నందన నామ సంవత్సరమే కాకుండా ఇక రాబోవు కాలమును కూడా ధైర్యముతో ఆనందముతో భగవన్నామముతో, తత్త్వ దృష్టి కలిగి యీ జీవితాన్ని సఫలీకృతం చేసుకుంటారు.

దశరథ మహారాజు 'రాఘవా!' అని శ్రీరామభద్రుని సంబోధించే వారట. దశరథ తనయుడు,అప్రమేయుడు,సీతమ్మ నాథుడు, ఆజానుబాహువు, రఘుకులానికే రత్నదీపమైనవాడు, అరవింద దళములవంటి నేత్రములు కలవాడు, నిశాచరులను, రాక్షసులను విశేషముగా నాశనము చేయువాడు అయిన రామునికి నమస్కరిస్తున్నాను.

ఒక్క మనస్కారముతోనే శ్రీరామచంద్రుడు మనలోని దుష్టరాక్షస ప్రవృత్తిని నామస్మరణ మాత్రముచేతనే హరింపజేస్తున్నాడు. ***'నామ స్మరణాదన్యోపాయం నహిపశ్యామో భవతరణే'. 'కలౌ స్మరణాన్ముక్తిః '*** -ఇంతేకాదు మహాత్ములు చెప్పారు మన యింటి గడపమీద దీపం పెట్టుకుంటే ఇంటిలోనికి బయటకి కూడా వెలుగు నింపుతుంది. అలాగే ముఖము నందు ఎల్లప్పుడు "రామ" అనే స్మరణ కలిగిఉంటామో ***అంతర్బహిశ్చ నారాయణః*** మనలోనికి వెలుపలికి కూడ శాంతితో కూడిన దృష్టి దృశ్యము కనిపిస్తుంది. 'రా' అనేసరికి నోరు తెరుచుకుంటుంది. 'మ్' అనేసరికి మూసుకుంటుంది. రాముడే మనసున నిలచినప్పుడు వేరు సంకల్పములకు దుర్విషయములకు తావే లేదు.

అట్టి శ్రీరామచంద్ర ప్రభువు సీతమ్మను చేపట్టిన సుందరమైన స్మృతిని నెమరువేసుకుంటూ మనందరము శ్రీరామకళ్యాణము నందు దశరథులవైపువారమా? లేక జనక మహారాజువైపు వాళ్ళమా? లేదు! ఇద్దరూ మనవాళ్ళే. పిల్లలై వచ్చారు అలంకరించుకోవాలి కదా! పెళ్ళికి రెడీ చేయాలి.

నవమి వచ్చేసింది. శ్రీవారు, సీతమ్మతల్లి బయట అలంకరణలతో తృప్తి చెందనివారు కదా! మనలోని సుగుణములతో స్వామికి జగన్మాతకు ఎలాగైతే ఏవి మనలో అమర్చుకుంటే ఇష్టమో, ఆయా వాటితో, లక్ష్యముతో మన హృదయ మందిరమును అలంకరించుకుంటే '**జీవబ్రహ్మైక్య**' అనుభవమును ఆనందింతుము గాక! అట్టి శక్తిని భక్తిని శ్రీగురుదేవులు మనకి ప్రసాదించెదరు గాక! ఆనందమానందమాయెనే! ...

శ్రీ సద్గురు చరణ సేవలో
మీ అమ్మ.

## పేద విద్యార్థులకు అవకాశము

### శ్రీ హనుమత్ కాళీ వరప్రసాద బాబు రెసిడెన్షియల్ స్కూల్

శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారి ఆశీస్సులతో, మరియు శ్రీమాతాజీవారి ఉన్నత ఆశయాలతో అభివృద్ధి చెందుతున్న గురుకుల పాఠశాలకు, ఒక భక్తుడు, ఆశ్రమనివాసి అయిన శ్రీకొండ వెంకట రాజుగారు గత 4సం॥లుగా పేద విద్యార్థులను ప్రోత్సహించి ప్రతిసంవత్సరం 50మందికి స్కాలర్‌షిప్ రూపమున 2000 రూ॥ నుండి 5000 రూ॥ల వరకు ఆర్థిక సహాయముతోపాటు ఉచిత పుస్తకాలు, యూనిఫారములను అందజేయుచున్నారు. అంతేకాకుండా యీ స్కాలర్‌షిప్‌లు పొందిన మెరిట్ విద్యార్థులకు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ మరియు పి.జి. కోర్సులలో ఆర్థిక సహాయం అందజేయుచున్నారు. ఈ సంవత్సరం నుండి **శ్రీచంద్రకాళీ విద్యానిధి** అనే ఫండ్‌ను నెలకొల్పి దాని ద్వారా మరొక 45మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయ వలెనని వారి ఉన్నత ఆశయము.

ఈ అవకాశమును ఆధ్యాత్మిక వాతావరణములో పిల్లల అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న తల్లిదండ్రులందరూ వినియోగించుకోవలెనని మా అభిలాష. పేద విద్యార్థులు మరియు స్కూలు అభివృద్ధికి తగిన రీతిలో సహాయాన్ని అందించవలసినదిగా దాతలను కోరుచున్నాము. విరాళములకు ఇన్‌కమ్ టాక్స్ రాయితీ కలదు. మిగతా వివరాలకు స్కూల్ మేనేజ్‌మెంట్‌వారిని సంప్రదించ ప్రార్థన. ఫోన్ నెం.
0863 - 2594211 సెల్ - 93932 20400, 93944 54647

# బాబూజీ ఉవాచ

(గతసంచిక తరువాయి) - వెంకట రమణ ప్రసాద్

చీకటి గది ఉంది. అందులో ప్రవేశించగానే మనకు ఏమీ కనబడక కాళ్ళకు కుర్చీలూ, బెంచీలూ కొట్టుకుంటాయి. మన జేబులో ఉన్న బ్యాటరీలైటు తీసి వెలిగిస్తే, చీకటి మాయమై అన్ని వస్తువులూ స్పష్టంగా కనిపిస్తాయి. ఆ వెలుగే భగవంతుడు. ఆ బ్యాటరీలైటే మన జీవితం. ఆ చీకటే ప్రపంచం. మనం చెయ్యవలసినదల్లా బ్యాటరీలైటు నొక్కి వెలిగించటమే. అంటే మనలో ఉన్న దివ్యజ్ఞానాగ్నిని రగిలించటమే అన్నమాట.



శ్రీకృష్ణుడు అర్జునుడి అజ్ఞానాంధకారాన్ని పటాపంచలు చేసి, అతడి జీవితాన్ని కాంతిమయం చేశాడు. అలా తనను ఉద్ధరించమని అర్జునుడు శ్రీకృష్ణ పరమాత్మకు శరణాగతుడయ్యాడు. మనకు అలాంటి శ్రద్ధా, శరాణగతి చెందగల ప్రపన్నతా ఉంటే భగవంతుడు మనల్ని తప్పకుండా ఉద్ధరిస్తాడు.

మహామునుల కంటె, మహర్షుల కంటె, జ్ఞానుల కంటె భగవద్భక్తుడు ఎంతో అదృష్టవంతుడు. ఒకప్పుడు నారదమహర్షి ధర్మరాజుతో యిలా అన్నాడు. "ఓ ధర్మరాజా! నువ్వు నా కంటె ఎంతో అదృష్టవంతుడవు. నువ్వు సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపుడవైన శ్రీకృష్ణుణ్ణి 'బావా!' అని నోరారా పిలవటానికి నోచుకున్నావు. ఆయనను కౌగిలించుకున్నావు. ఆయనకు ఆతిధ్యమిచ్చావు. ఆయన చేత ఆదరింపబడ్డావు. ఇటువంటి మహత్తరమైన అదృష్టం ఏ మహర్షికి, యోగికి కూడా లభించలేదు. "

నిజమే! నారద మహర్షి మాటలు నూటికి నూరుపాళ్ళూ సత్యమే. ధర్మరాజు చాల అదృష్టవంతుడు. కాని అతనిలాగే మనం కూడా శరణాగతి పొందగలిగితే మనం కూడా అదృష్టవంతులం కాగలం. భగవంతుడు భక్త సులభుడు. రాధ వెన్న చిలుకుతుంటే వచ్చి కూర్చునేవాడు శ్రీకృష్ణపరమాత్మ. ఆమె యమునకు వెడితే ఆయన వెంటపడేవాడు. అలాగే మనం కూడ ఆయనను శరణుజొచ్చితే, ఆయనను నిష్కళంక భక్తితో ప్రేమిస్తే, ఆయన వెంట పడితేనే, ఆ తరువాత ఆయన మన వెంట పడతాడు.

అలా భగవంతుని చేరుకోవటానికి మార్గం చూపించే మహాత్ముడినే మనం ***గురువు*** అంటాము. వేదాలు ఆయన్ని **పరబ్రహ్మం** అని కీర్తించాయి. ఆయన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడి స్వరూపుడే గాక పరబ్రహ్మము కూడ. **సత్యమనే నావను నడిపే చుక్కానివంటి వాడే సద్గురువు** అని మీరా సద్గురువును కీర్తిస్తుంది. అటువంటి సద్గురువే సంసారసాగరాన్ని దాటించగలడు. అందువల్ల మనం నేను - నాది అనే అహంకార మమకారాలను త్యజించి, సద్గురుమూర్తి అనే నౌకను ఆశ్రయిస్తే ఆయన ఈ సంసార సాగరాన్ని దాటించి అవతల ఒడ్డున ఉన్న భగవంతుడి దగ్గరకు చేర్చగలడు.

అందువల్ల కాఫీ, టీలకోసం వెంపర్లాడటం మాని, కృష్ణ నామామృతాన్నో, రామనామామృతాన్నో, కాళీనామామృతాన్నో స్వీకరించటం మొదలు పెట్టండి. అటువంటి దివ్యౌషధాన్ని మనకు అందించగల భవరోగవైద్యుడే సమర్థ సద్గురు.

*

## లక్ష్మీ కటాక్షం

ఒకరాజుగారి వద్ద ఒక ప్రధానామాత్యుడుండేవాడు. ఆయనకు లక్ష్మీదేవిని ప్రత్యక్షం చేసుకోవాలని గాఢమైన కోరిక కలిగింది. అందుకోసమై ఆయన ఎన్నో జపాలూ, తపాలూ చేశాడు. లక్ష్మీ సహస్రనామాలు నూరు సార్లు జపించాడు. లక్ష్మీదేవి ప్రత్యక్షం కాలేదు. విసుగెత్తేదాకా లక్ష్మీ పూజ చేశాడు. ఆ దేవి కటాక్షించలేదు.

కాలక్రమేణ ఆయనకు ఐహిక సుఖాలమీద విరక్తి కలిగింది. లక్ష్మిని ప్రత్యక్షం చేసుకోగలనన్న నమ్మకం కూడా పోయింది. ఆయన సన్యాసాశ్రమం స్వీకరించి, తపస్సు చేసుకోవటానికి అరణ్యానికి బయలుదేరాడు. తలవనితలంపుగా దారిలో ఆయనకు లక్ష్మీదేవి ప్రత్యక్షమై "నన్ను ప్రత్యక్షం చేసుకోవటానికి, నీవుచేసిన పూజలు, వ్రతాలూ చూసి నీకోర్కె తీర్చటానికి వచ్చాను'' అన్నది.

"వెళ్ళవమ్మా! వెళ్ళు నా కోరికలన్నీ ఉడిగాయి. నేనిప్పుడు అన్నీ త్యజించిన, సన్యాసిని. కోరికకలిగినప్పుడు కనబడకుండా, అవసరం లేనప్పుడు ఎందుకు కనిపిస్తున్నావు?'' అని అడిగాడు ఆ సన్యాసి. "నా దర్శనం కోసం యాచించినంతకాలమూ నీవు బిచ్చగాడివే. నేను బిచ్చగాళ్లకు దర్శనమివ్వను. బిచ్చగాళ్ళ మనస్తత్వం నీలో లేకుండా పోయింది కనుక నీకిప్పుడు కనిపించాను'' అన్నది లక్ష్మీదేవి.

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

సంత్ ఏకనాధ్ మహరాజ్ అటువంటి వాచా వేదాంతి కాదు. ఆయన గోదావరి నదిలో స్నానం చేసి తిరిగివస్తూ వుంటే అసూయాగ్రస్తుడైన వాడొకడు, ఆయన మీద ఉమ్మివేస్తాడు. ఏకనాధుడు మారు మాట్లాడకుండా తిరిగి గోదావరిలో దిగి, స్నానం చేసి మళ్లీ వస్తారు. ఆ మూర్ఖుడు మళ్ళీ ఆయనపైన వుమ్ముతాడు. ఆయన మళ్ళీ స్నానం చేసి వస్తారు. ఇలా 108 సార్లు జరుగుతుంది! చివరకా తుంటరి విసిగిపోయి, "ఏమయ్యా! నీకు సిగ్గులేదా ఇన్ని సార్లు ఉమ్మినా కూడా?" అంటే, ఏకనాధుల వారంటారు, "నాయనా! నాకు కావాలంటే 108సార్లు గోదావరీ స్నానం చేయగలనా? అందులో ఇవాళ పవిత్రమైన ఏకాదశి



కూడాను. హాయిగా అష్టోత్తర శతనామాలు (108) చదువుకుంటూ పవిత్ర గోదావరి స్నానం 108 మారులు చేసే మహద్భాగ్యాన్ని, భగవంతుడు నీరూపంలో వుండి నాకు ప్రసాదించాడు." అన్నారు. ఆహా! ఇదికదా నిజమైన తితీక్ష. ఇది Practical (అనుభవం). 'దేహం నేను కాదు' అనే భావన ఎంత దృఢంగా వుంటే, అలా చేయగలిగారు ఆ మహానుభావులు?

భగవన్నామం మనసారా అనాలి. సంకల్పాలన్నీ మరచి, ధ్యానం చేయాలి. మనసు ఖాళీ చేసుకుని, మనసునిండా భగవంతుడిని నింపుకుని ధ్యానం చేయాలి. అదే "వేణువు" యొక్క రహస్యం.

గోపాలకృష్ణుడికి అత్యంత ప్రీతి పాత్రమైనది 'వేణువు'. అది ఒక వెదురుముక్క. లోపలంతా డొల్లే. దానికి రెండు వేపులా రెండు రంధ్రాలు - మధ్యలో మరొక ఏడు రంధ్రాలు. కానీ గోవిందుడు దానిని విడిచి వుండలేదు. ఆయన పెదవులు దానిపై మధుర రాగాలని పలికిస్తాయి. కృష్ణయ్య అధరామృతమే మురళికి పానం. ఆయన శ్వాస నిశ్వాసలే దానికి ప్రాణం.

ఆఖరికి నిద్ర పోతున్నాకూడా స్వామి, ఆ వేణువుని తన బొడ్డులోనే దోపుకుని వుంటాడు. ఎంతటి విడదీయరాని బంధమో కదా! ఇది చూసి రాధమ్మకి కూడా ఈర్ష్య కలిగిందిట. "ఏమిటబ్బా ఈ వేణువు గొప్పదనం? స్వామి దానిని విడిచి క్షణమైనా ఉండడు" అనుకుంది. ఇది ఈర్ష్య అనేకంటే, 'జిజ్ఞాస' అంటే బాగుంటుందేమో! "మనం పొందలేనిది ఈ వేణువు ఎలా పొందుతోంది? ఏం చేస్తే మనం కూడా అటువంటి స్థితిని పొందవచ్చు?" అని తెలుసుకుందామనే 'జిజ్ఞాస' కలిగింది రాధకి, గోపికలకి.

ఏనాడయితే సాధకునిలో నిజమైన జిజ్ఞాస కలుగుతుందో వారికి సత్యాన్ని తెలుసుకునే అవకాశాన్ని ప్రసాదిస్తాడు భగవంతుడు. చివరికి అలాకాకుండా అది ఉత్తుత్తి ఏడుపు, ఈర్ష్యాసూయలు అయితే, దానిని మరింత అయ్యేటట్టు ఏడిపిస్తాడా నల్లనయ్య! ఇక్కడ రాధ, గోపికలకి నిజమైన జిజ్ఞాస కలిగింది కాబట్టే వారిని అనుగ్రహించాడు స్వామి. ఆయన శయనించినట్టుగా నటిస్తూ, తన బొడ్డున వున్న మురళిని ప్రక్కగా జారవిడుస్తాడు. అంత రాధ, గోపికలు అక్కడికి వచ్చి ఆ మురళిని తీసుకుని దూరంగా వెళ్ళి, "ఏమమ్మా మురళీ! నీలో ఏం గొప్పదనం ఉందని, కృష్ణయ్య నిన్ను ఒక్కక్షణం కూడా వదలి ఉండడు? ఆ రహస్యం మాకు చెప్పవా?" అంటారు.

అప్పుడు మురళి యీ విధంగా చెప్తుంది. "నాలో ఏముందో మీరే చూడండమ్మా! నాలో ఏమీ లేదు. ఖాళీ మాత్రమే వుంది. స్వామివారు ఇచ్చినది ఇచ్చినట్టుగా, నాకంటూ ఏమీ దాచుకోకుండా, ప్రపంచానికంతటకీ పంచి ఇస్తున్నాను. ఆ స్వామి ఏమి పలికితే అది ఈ నోట మీకు వస్తుంది. అందులో నా గొప్పదనం ఏమీలేదు. నాద్వారా ఆ స్వామి వెల్లడి చేయబట్టి కదా మీరందరూ ఇక్కడికి వస్తున్నారు. మీరు కూడా అలాగ మీ మనస్సులు ఖాళీ చేసుకోండర్రా! అదే స్వామి సాన్నిధ్యానికి సమాధానం!" అంది వేణువు.

అందుకనే మనసుని ఖాళీ చేసుకుని ఆ ప్రభువుని పిలిస్తే, ఆ నామమే మనలో ప్రతిధ్వనిస్తుంది. మనసునిండా విషయాదులు, సంకల్పాలు పెట్టుకుంటే ఇక ప్రభువు నామానికి స్థానం ఎక్కడుంటుంది?

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

**14-6-1985**

ఈ రోజు ఉదయం శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ భక్తునికి భగవంతుని మీద, భగవంతునికి భక్తుని మీద తీవ్ర తపన ఉంటుంది. అది ఎలా ఉంటుంది? జనకుడు రాజ్యపాలన చేస్తున్నా ఆయన మనస్సు శ్రీమన్నారాయణుని పాదారవిందాలపైన పుట్టుమచ్చలాగ అతుక్కుపోయింది. మీకు ఇంకా చక్కగా అర్థం కావాలంటే జేష్ఠమాసంలో పెళ్ళి అయిన వధూవరులు ఆషాఢమాసంలో ఒకరికొకరు ఫోన్‌కోసం, లెటర్‌కోసం తపన చెంది ఎలా ఎదురు చూస్తారో అలా ఉంటుంది ఆ భక్తుని తపన. ఆషాఢ మాసం వెళ్ళిపోగానే శ్రావణమాసంలో వధూవరులు ఇద్దరూ మంగళగిరి నరసింహస్వామిని దర్శించడానికి వెళ్ళారు. స్వామిని దర్శించుకొని ఇద్దరూ కలిసి వెళ్తుండగా మంగళగిరి తిరునాళ్ళలో జనం గుంపులు గుంపులుగా అడ్డం వచ్చేసరికి ఇద్దరూ విడిపోయారు. ఇద్దరూ ఒకరి కోసం మరి ఒకరు ఎలా తపన చెందుతారో అలా ఉంటుంది భక్తుని తపన. ఆలా విడిపోయిన వధూవరులు తిరిగి కలుసుకున్నప్పుడు ఎలా ఆనందిస్తారో భగవంతుని దర్శించిన భక్తుడు కూడా అలానే ఆనందపడతాడు అన్నారు శ్రీబాబు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ కూర్మదాసు మహాభక్తుడు. పాండు రంగడి దర్శనార్థం చెందిన తపనకు ఫలితంగా పండరీనాధుడు షావుకారు వేషంలోవచ్చి భోజనాన్ని అందిస్తాడు. అంతటి అదృష్టం ఎవరికి కలుగుతుంది? పరమాత్ముడు అందించిన పదార్థం స్వీకరించటంతో కూర్మదాసు ప్రయాణ బడలిక ఎగిరిపోయింది. వెంటనే ఆయన్ని ఎవరు బాబు మీరు? అని ప్రశ్నించాడు. ఆయన మాట్లాడుతూ నా ఉద్యోగం ఇదే బాబూ భక్తుల ఎల్లరకు క్షుద్బాధ తీర్చటం, భక్తులను దర్శించి ఆశీస్సులు పుచ్చుకుంటూ ఆనందించటం అని చెప్పి అంతర్ధానమయ్యాడు. అలా ఉంటాయి భక్తుల తపన, భగవానుని ప్రేమ.

పవిత్ర క్షేత్రాలను దర్శించటం ఎందుకు? బురద తొక్కిన కాలుని కడుక్కోవటానికి. ఒక్కొక్క గుణాన్ని త్యాగం చేయాలి. కాశీ విశ్వనాధుని

దర్శించటానికి వెళ్తారు. ముందుగా గంగానదిలో స్నానం చేసి స్వామికి అభిషేకం చేసుకుని విశ్వనాథుని స్తోత్రం చేసి ధ్యానించిన తరువాత మీకు ప్రియమైన దానిని ఆ గంగలో త్యజించాలి. ఇలాగే ఒకాయనను మీకు ప్రియమైనది ఏమిటండీ? అని అడిగితే నాకు చతుర్ముఖ పురాణం ఎంతో ప్రియమైనదండీ అని చెప్పాడు. మరి దానిని త్యాగం చేయగలరా? అని అడిగాను. అది నన్ను లక్ష్మీ పుత్రుని చేసింది, అదే నాకు మనశ్శాంతినిచ్చేది అని అన్నాడు. అదేమిటండీ దాని వలనే కదా మీకు ఫిస్టుల్లా వ్యాధి వచ్చి రెండుసార్లు ఆపరేషన్ అయింది అన్నాను. పోనీ రెండవ పక్షంలో మీకు ఇష్టమైనదేదైనా ఉంటే చెప్పండి అని అడిగాను. నాకు సిగరెట్టు అన్నా, డ్రింకు అన్నా చాలా ఇష్టమండీ బాబూ అన్నాడు. మరి వాటిలో ఏదైనా ఒకటి త్యాగం చేయగలవా? అంటే సరేనండీ అని ఒక సంవత్సరం మూడు మాసాల తరువాత తిరిగి మనస్సు పంజాదెబ్బ కొట్టింది. మనస్సు అనే మాయ ఎంత గొప్పదో చూశారా?

దానిని మనం జయించామని అనుకోవటానికి లేదు. అంత్యకాలంలో మనస్సు శ్రీ మన్నారాయణుని దివ్య చరణారవిందాలపై నిలిచినప్పుడే నీవు కృతార్థుడవవుతావు. ~~ఈ~~లోగా మనస్సు ఎంత నిలిచినా ఏం లాభం? మానవులు సంకటములకు గురి అయినప్పుడు నవగ్రహాలకు శాంతి చేస్తారు. ఎంతో ధనాన్ని ఖర్చు చేస్తారు. తల నీలాలు ఇస్తామని మొక్కుకుంటారు. కాని ధనం ఖర్చు లేకుండా దుష్టగ్రహాల నుంచి రక్షించే మహాత్ముల మాట నమ్మరు. పరమాత్మునికి తల నీలాలు సమర్పించటమెందుకు? తల మీద వెంట్రుకలు తొలగిస్తే అవి ఎలా మొలచుకుని వస్తాయో అలా నీలో పుట్టే సంకల్పాలని సమర్పించమన్నాడు పరమాత్ముడు.

-సశేషం

**ఋషభ మహర్షి విసర్జించిన మలం సుగంధ పూరితమై సువాసనలను వెదజల్లిందట. అనగా ఆత్మ తత్త్వం నరనరాన జీర్ణించి ప్రతి రక్తకణం అతి పరిశుద్ధంగా మారిందన్నమాట.**

-శ్రీకాళీప్రసాద బాబు

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**ఏప్రిల్ 2012**

**01 ఆది** శ్రీరామనవమి తె॥జా 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గంటలకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణమహోత్సవము, భక్తసమారాధ.

**06 శుక్ర** పౌర్ణమి. శ్రీసద్గురుపాదపూజ.

**15** ఆది గురుదశమి, సత్సంగం,శ్రీ సద్గురు పాదపూజ.

**19** గురు మాసశివరాత్రి

**26** గురు శ్రీశంకరాచార్య జయంతి, శ్రీ సద్గురు సప్తదశ వార్షిక ప్రతిష్టా మహోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

**మే 2012**

**6 ఆది** వైశాఖ గురు పూర్ణిమ, బుద్ధ జయంతి, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

**10 గురు** శ్రీ మహాకాళికా పరమేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామి ఏకత్రింశత్ ప్రతిష్టా వార్షిక మహోత్సవము, రాత్రి 7 గం.లకు శ్రీ మహాకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వర స్వామి వారి లీలా కళ్యాణ మహోత్సవము.

**15 మంగ** శ్రీగురుదశమి, హనుమత్ జయంతి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

**19 శని** మాసశివరాత్రి.

### వట్టి చేతులు

***అలగ్జాండరు మరణ సమయంలో "నా శవాన్ని తీసుకు వెళ్ళేటప్పుడు మిగిలిన శరీరంపై బట్ట కప్పినా, చేతులు అందరికీ కనిపించేటట్లు తీసుకు వెళ్ళండి. చక్రవర్తి తన వెంట ఏమీ తీసుకు వెళ్ళకుండా వట్టి చేతులతో వెళ్ళిపోయాడు అని అందరికీ తెలియటం మంచిది" అన్నాడు.***

## భగవంతుడు కులాతీతుడు

- సుషుమ్న ప్రసాద

మన సంఘంలో కుల వ్యవస్థను పాటించటమనేది పవిత్ర గ్రంథములు నిర్ణయించినవే అనే తప్పుడు అభిప్రాయం ఉన్నది. అది సత్యమునకు సుదూరమైన విషయం. గీతాచార్యుడైన కృష్ణభగవానుడు జ్ఞానయోగంలో

***చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః ।***
***తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తారమ వ్యయమ్ ॥*** (4అ-13శ్లో)

అంటే మానవుని గుణగణములు, స్వభావములను అనుసరించి నాలుగు వర్ణములకుగ (కులములుగ) విభజింపబడ్డారు. ఆ కర్మకు కర్తనైన నన్ను నాశరహితునిగ, అకర్తగా గ్రహించు.

అందుచేత వ్యక్తుల మధ్య విభేదానికి భగవానుని నిందించరాదు. ఈ రోజు మనం చూసే కులవ్యవస్థ వాస్తవానికి సుదూరమైనది. ఎందుచేతనంటే భగవంతుడు ఒక వ్యక్తి పుట్టుకతో మాత్రమే గొప్పవాడు కాదని నొక్కి వక్కాణించాడు. దురదృష్టవశాత్తు ఒక వ్యక్తి యొక్క పుట్టుక, పెంపకము, స్వార్థపరత్వము, వారసత్వము మున్నగునవి కుల వక్రీకరణకు దోహదం చేశాయి,

భగవంతుడు యీ కుల, వర్గ, విభేదాలన్నిటికీ అతీతుడు. భగవంతుడు ఎప్పుడూ దీనదయాళుడు. కరుణామయుడు. అనేక సందర్భాలలో వివిధ వర్ణాలకు, వర్గాలకు చెందిన భక్తులను రక్షించటంలో యీ విషయం ఋజువైంది.

ద్వాదశ వైష్ణవ మహాప్రవక్తలలో ఒకరైన 'తిరుప్పానారాళ్వారు జీవితానుభవము యిందుకు చక్కని ఉదాహరణ.

శ్రీమన్నారాయణుని శ్రీవత్స అంశగా పరిగణింపబడిన యీ ఆళ్వారు కావేరీనది దక్షిణతీరంలో ఉన్న ఒరయూరు గ్రామంలో పంచమ కులానికి చెందిన దంపతులకు దొరికాడు. ప్రస్తుతం తిరుచిరపల్లి నగరంలోని ఒక పల్లెవాడ. వాయిద్యంతో భక్తిగీతాలని ఆలాపించే యీ పంచమకులం వారు **పానార్లు** అని పిలవబడతారు. తమిళంలో పాను అంటే రాగమని

అర్ధం. సంతాన హీనులైన ఆ దంపతులు ఆ బిడ్డను చూసి, ఆనందపడి, **తిరుప్పానారు** అని పేరు పెట్టి తమ బిడ్డగా పెంచుకున్నారు. ఆ చిన్నారి కూడా వీణావాయిద్యం చేత గీతాలను ఆలాపిస్తూ, మధురంగా పాడటంలో నిష్ణాతుడయ్యాడు. శ్రీరంగనాధుని కృపతో స్వామికి ప్రగాఢ భక్తుడైనాడు.

స్వామి దర్శనానికి అతను ఎంతగా ఆరాటపడుతున్నా పంచమ వర్ణానికి చెందినవాడు కాబట్టి, శ్రీరంగంలో ప్రవేశించటానికి అర్హత లేదని భావించాడు. అందుచేత రోజూ ఉదయాన్నే కావేరి నది దక్షిణతీరాన నిలబడి, శ్రీరంగనాధ స్వామి కళ్యాణ గుణగణాలను స్తోత్రము చేస్తూ, కీర్తనలనాలపించే వాడు. అలా కాలాన్ని విస్మరించి, అనేక సందర్భాలలో సమాధిస్థితిలో మధురభక్తి గీతాలనాలాపించేవాడు.

ఒకరోజు శ్రీరంగనాధస్వామి పవిత్రాభిషేకమునకు (తిరుమంచనము) ఆలయ పూజార్లు సాధారణంగా ఘటములతో జలం కావేరీనది ఉత్తర తీరం నుండి తెచ్చేవారు. కానీ ఆరోజు నదీజలం దక్షిణదిశకు ప్రవహిస్తూండటము వలన వారు దక్షిణతీరానికి వెళ్ళారు. అక్కడకి సమీపించేటప్పటికి, తిరుప్పానారు ఆఘట్టము దగ్గర నిలబడి ఉండటం గమనించారు. వెంటనే వారు తిరుప్పానారును అక్కడ నుండి తప్పుకోమని, లేకుంటే నీరు అపవిత్రమై పోతుందని బిగ్గరగా అరచారు. ప్రగాఢమైన భక్తిపారవశ్యంలో లీనమైపోయిన తిరుప్పానారుకు పూజార్ల గర్జన వినిపించలేదు. వారిలో ఒకరు తిరుప్పానారుపై సున్నితంగా రాయి విసిరాడు. వెంటనే ఆయన కళ్ళు తెరిచాడు. ఆచారవంతులైన ఆ బ్రాహ్మణ పూజార్లను చూసి వారికి వినమ్రతతో క్షమాపణ చెప్పుకొని అక్కడ నునిడి నిష్క్రమించాడు.

లోకసారంగముని ఆధ్వర్యంలో పూజార్లు పవిత్రాలయు గర్భాలయంలో తిరుమంచనము (పవిత్రాభిషేకము)నకు సమీపించగా గర్భాలయ ద్వారములు మూసుకుపోయి తెరవబడలేదు. వెంటనే ద్వారములు తెరవటానికి తాళములు చేసేవారికి కబురుచేశారు. వారు కూడ ఎంత ప్రయత్నించినా ద్వారములు తెరవలేకపోయారు. ఈ సంఘటనకు దిగ్భ్రాంతి చెందిన వారికి, దివ్యవాణి వినిపించింది.

“ఓ! లోకసారంగమనీ! నీవు నా ప్రియభక్తుని నిందించావు. అందుచేత యీ క్రతువునందు నాకాసక్తి లేదు. నీ కఠినమైన ప్రవర్తనకి అతనికి నీవు పశ్చాత్తాపముతో క్షమాపణ చెప్పి యిక్కడకు తోడ్కొని రా!”. -సశేషం

# గురు కృపాహి కేవలమ్

(గత సంచిక తరువాయి) **సేకరణ-రమణ ప్రసాద్**

రాజుగారు మాట్లాడుతూ వెంకట్రాజుగారు నింద్రకొలనులో ఆయన మిత్రులందరికీ "శ్రీబాబు మహాపురుషులు. ఆయనను ఎట్టి పరిస్థితులలోనూ విడిచిపెట్టకండి. మీరంతా యీ తరంలో జన్మించటం చాలా అదృష్టం. ప్రతి యుగానికి ఒక మహాపురుషుడు ఉద్భవిస్తాడు. ఆనాడు శ్రీరామచంద్రుని సేవించినవారి కథలు వింటే మనకు ఎంతో అసూయతగా ఉంటుంది. శ్రీరామచంద్రుని వంటి యుగపురుషుడు మన బాబూజీ. ఆయనను సేవించండి. మనలనందరినీ ఆయన తరింపజేస్తారు" అని వెంకట్రాజుగారు చెప్పేవారని అన్నారు.

ఒకసారి డా॥వెంకట్రాజుగారికి చాల సుస్తీ చేసింది. భీమవరం తీసుకువెళ్ళి తనకు వైద్యం చేయించ వలసినదిగా బంధుమిత్రులను ఆయన కోరారు. భీమవరం వెళ్ళి ఒక సత్రంలో మకాం చేశారు. ఎంతమందో వైద్యులు కృషి చేశారు. కాని ఆయనకు ఉపశమనం కలగలేరు. వైద్యులు పెదవి విరిచారు. భగవంతుడు మినహా ఎవరూ రక్షించలేరని చెప్పారు.

అట్టి సమయంలో రాజుగారు శ్రీబాబుని దర్శించాలని కోరారు. ఆయన కదిలే స్థితిలో లేరు. అదే సమయంలో శ్రీచల్లా కృష్ణమూర్తిగారు శ్రీబాబుతో మహాత్ములు మహత్తులు ప్రదర్శించటం గురించి చర్చ వచ్చి, చనిపోయిన వారిని బ్రతికించటం అసాధ్యమని ఆయన బాబూజీతో వాదించారట.

దీనిని నిరూపించటానికే అన్నట్లుగా ఈ ఉదంతం జరిగింది. వెంకట్రాజుగారు ప్రాణాలు విడిచారు. ఆయన శరీరానికి చీమలు కూడా పట్టాయి. డాక్టర్లు అంతా ఆయన మరణించినట్లుగా నిర్ధారణ చేశారు. ఆయన అంతిమ యాత్రకు అంతా ఏర్పాటు చేయబడింది. అయితే వెంకట్రాజుగారి మరణవార్తను శ్రీబాబూజీకి తెలియజేయటానికి వెళ్ళిన వార్తాహరుడు కాలానికి మించి సైకిలు మీద ప్రయాణం చేశాడు.

ఆ ప్రయాణం ఎలా చేశాడో ఆ పరమాత్ముడికే తెలియాలి. బాబూజీ ఆ వార్తాహరునికి మాత్రం "నేను ఇప్పుడే వస్తున్నాను. డాక్టరుగారిని నేను వచ్చేవరకు మాత్రం ఉంచమనండి'' అని చెప్పారు.

శ్రీబాబు వచ్చేవరకు డాక్టరుగార్ని అలానే ఉంచారు. ఆయన భార్య తనకు పతిభిక్ష పెట్టమని శ్రీబాబుని కోరారు. శ్రీబాబు జగన్మాతను ప్రార్థించి, మృతి చెందిన రాజుగారికి ఇంజక్షన్ ఇవ్వమన్నారు. డాక్టర్లు అంతా అవహేళన చేశారు. అయినప్పటికి శ్రీబాబు ఆజ్ఞమేరకు తుదకు ఇంజెక్షన్ యిచ్చారు.

శ్రీబాబు రాజుగారి భార్యను "అధైర్యపడకండి. మీ భర్త కోలుకుంటారు. కొద్దిసేపు అయ్యాక మంచినీరు అడుగుతారు ఇవ్వండి'' అని చెప్పారు. తాము మాత్రము ధ్యానములో నిమగ్నమైనారు.

శ్రీబాబు చెప్పినట్లుగానే సుమారు 12గంటలు సమయంలో వెంకట్రాజుగారు కోలుకొని, మంచినీరు అడిగారట. దీనిని గమనించి డాక్టర్లు ఇది కలా? నిజమా? అని ప్రశ్నించుకొన్నారట.

శ్రీబాబు బాల్యంలో అనేక వ్యాయామ ప్రదర్శనలు చేసేవాడినని చెబుతూ "గారడీ విద్యల ప్రదర్శనల వ్యామోహంలో పడిన మానవుడు వాటి ఆకర్షణల నుండి తప్పించుకొనలేక భ్రష్టుడౌతాడు. మనస్సుని దీని నుండి నిగ్రహించుకోవాలి'' అన్నారు శ్రీబాబు.

"చీకటి గదిలో మానవుడు ఎలా ఎదురు దెబ్బలు తింటాడో అలాగే అజ్ఞానమనే చీకటి ఆవరించిన మనస్సు విషయవాసనలకు లోనై శాంతి ఉండదు. మహాత్ములు ఎల్లప్పుడూ ఆత్మ దర్శనమనే జ్ఞానతేజస్సును దర్శిస్తూ ఉంటారు. వారు కేవలం కారణ జన్ములు. వారు తాము నిర్వహించవలసిన కార్యక్రమాన్ని పూర్తిచేసిన పిమ్మట దేహపరిత్యాగము చేస్తారు. వారే సత్యగురువులు. వారి దివ్యచరణార విందములయందు మనస్సు నిలిపినవారి జన్మ చరితార్థము'' అన్నారు శ్రీబాబు.

"కాబట్టి మీరు సాధించవలసినదేది? తాత్కాలికమైన కీర్తిని ఆర్జించే మహాశక్తులా? శాశ్విత ఆనందాన్నిచ్చే ఆత్మజ్ఞానమా?'' అని ప్రశ్నించారు శ్రీబాబు.

*

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి) -సుశీలా ప్రసాద

21. ***స్తోక స్తోక నిరుధ్య మాన మృదుల ప్రస్యన్ది మందస్మితం***
***ప్రేమోద్భేద నిరర్గళ ప్రసృమర ప్రవ్యక్త రోమోద్గమమ్***
***శ్రోతృ శ్రోతృ మనోహర వ్రజవధూ లీలా మిథో జల్పితం***
***మిథ్యాస్వాప ముపాస్మహే భగవతః క్రీడాని మిల ద్దృశః ॥***

సడికాకుండా నడిచి వస్తున్నాడు నంద బాలుడు. అల్లంత దూరంలో ఉన్నారు గోపికలందరూ తన కోసం అక్కడికి వచ్చి ఎదురు చూస్తున్నారని తెలుసు వానికి. సరాసరి వారి దగ్గిరకి వెళ్ళిపోతే అందులో చమత్కారం ఏముంది? వారంతా తన రాకకై ఎంతో ఎదురు చూడాలి. ఆ ఎదురు తెన్నులు నీరీక్షణమై, అది ఆవేదనగా మారి, అందువలన చిత్త ఏకాగ్రత కుదిరి, ఆ ధ్యాసలో రెండోవస్తువు లేని అనుభూతిని పొందాలి. అప్పుడు కనుక తను వారికి దర్శనం యిస్తే, వారికి పూర్ణమైన ఆనందం లభ్యమవుతుంది. అందుకుగాను వారి వెనుక వైపు నించి వెళ్ళి, దట్టంగా అల్లుకున్న పూల పొదల మాటున ఒత్తుగా రాలి ఉన్న పూల పాన్పు మీద ఒదిగి ఉంటేసరి అనుకుని గోపికలంతా మాట్లాడుకునే మాటలు వినవచ్చేంత దూరంలోనే సుఖంగా విశ్రమించి ఉన్నాడు.

శ్రీకృష్ణుని రాకకోసం ఎదురు చూస్తూ ఎంతకీ రావటం లేదని ఆవేదన పడుతూ నిరీక్షిస్తూ ఉన్న గోపవనితలంతా వియోగాన్ని భరించలేకపోతూ సరే వాని గురించిన ఊసులే చెప్పుకుంటూ కాలం గడుపుదామనుకున్నారు. ఒక్కొక్కరే తమ అనుభవాలను చెప్పుకుంటున్నారు. అప్పుడు అలాగ సాగిపోతున్న వారి వాక్ప్రవాహంలో ఒక చిన్నది తన తీయని పలుకులను సన్నని సెలయేరు పారుతున్నట్లు మనోహరంగా వినిపించసాగింది.

“నేను మధురలో పుట్టి పెరిగాను. నాగరికత వాతావరణంలోనే ఎదిగాను. పల్లెలు నేను ఎరుగను. మేనరికమంటూ అక్కను వ్రేపల్లె యిచ్చినప్పుడు పెళ్ళి సమయంలో వెళ్ళినప్పుడు చూశాను వ్రేపల్లెను. ఊరు నాకేమీ నచ్చలేదు. అక్కడ కాపురం చెయ్యాల్సింది అక్క కనుక తను

కోడలుగా ఒదిగి ఉండవలసిన మనిషి గనుక అది సర్దుకుపోతుందిలే అనిపించింది. కొన్నేళ్ళు గడిచాయి.

నాక్కూడా ఎవరికైనా చూసి ముడిపెడదామనుకున్న అమ్మనాన్నలు మళ్ళీ పెళ్ళయి అత్తవారింటికి వెడితే యిప్పుడు నాకున్నంత స్వేచ్ఛ అప్పుడింక ఉండదని నన్ను అక్కదగ్గరకెళ్ళి నాలుగురోజులుండి రమ్మనమన్నారు. అక్కలాగే నాకూ మేనత్తే గనుక నన్ను చాలా ఆదరంగా ప్రేమగా చూశారు యింట్లో వాళ్ళంతా. రాకరాక వచ్చానాయె. అయితే వారింట్లో పద్దతులేమీ నాకు నచ్చలేదు. నేను పట్నవాసం మనిషిని. అలాగే రెండు రోజులు గడిచాయి.

ఆ రాత్రి నాకెందుకో నిద్ర పట్టలేదు. పడక మీద అటూ యిటూ పొర్లుతున్నాను. అంతలో వాకిలి గడియ తీసిన చప్పుడు అయింది. ఎవరా అని మంచం మీద నుంచే తలెత్తి చూశాను. అక్క తలుపు తీసుకుని బైటకి వెడుతోంది. అర్థరాత్రి దాటిందేమో అప్పుడు అంతా గాఢ నిద్రలో ఉన్నారు. త్వరగా లేచి అక్క మూసిన తలుపు తీసి చూశాను మెల్లిగా. బయటంతా నిశ్శబ్దంగా ఉంది. చకచకా ముందుకి సాగిపోతోంది అక్క. ఎక్కడికి? అక్క ప్రవర్తనలో ఏదైనా మార్పు వచ్చిందా? బరువెక్కిన మనస్సుతో పడక చేరి ఆలోచిస్తూనే ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు.

మర్నాడు అక్కని అడుగుదామని, మళ్ళీ బాగుండదేమో అని ఊరుకున్నాను. మర్నాడు రాత్రి కూడా గమనించాను అక్క వెళ్ళటం. బంగారంవంటి బావని యింట్లో పెట్టుకుని అక్క యిలాగ దారి తప్పిందేమిటా అని మనస్సు సందేహిస్తోంది. నేనూ త్వరగా లేచివెళ్ళి తనని అనసరించాలని వీధి గడపదాటి నాలుగు అడుగులేసేసరికి పుచ్చపువ్వులా కాస్తున్న వెన్నెలలో పడగవిప్పి బారెడు పొడుగు ఉన్న త్రాచుపాము నా కాళ్ళ ముందుకి వచ్చింది. ఎక్కడి నుంచో తెలియదు. ఎలాగ పరుగెత్తి వచ్చి యింట్లో పడ్డానో, అది గుర్తుకువచ్చి  చాలాసేపు వణుకుతూనే ఉన్నాను.

మర్నాడు అక్క అదే వరస. పామేదైనా ఎదురైనా భయపడకుండా త్వరగా వెళ్ళి తనను కలుసుకోవాలని ధైర్యంగా నడిచాను. వీధి మలుపు తిరిగేంతలో కళ్ళ ఎదుట పెద్ద వెలుగు! ఆ వెలుగులో మసక మసకగా ఏవో ఆకారాలు. అంత వెలుగుని చూడటం భరించలేక కళ్ళు చీకట్లు కమ్మాయి. అప్పుడు కూడా నా ప్రయత్నం విఫలమైంది.

-సశేషం

# డబ్బు చెడ్డది కాదు

- భోగరాజు భారతి

నలుగురు దొంగలు అడవిదారిన నడుస్తున్నారు. నడిచి అలసిపోయిన వారికి కొంచెం దూరంలో పెద్ద కొండగుహ కనిపించింది. అందులో విశ్రాంతి తీసుకొందామని అటువెడుతుంటే ఒక సాధువు అటునించి పరుగెత్తుకుని వస్తూ "అయ్యల్లారా! ఆ గుహకేసి వెళ్ళకండి. అందులో మృత్యుదేవత ఉంది. నాకు భయం వేసి ఇలాగ పారిపోతున్నాను. నా మాట వినండి." అంటు వెళ్ళిపోతున్న సాధువుని చూస్తూ దొంగలు ఆశ్చర్యపోతూ "అసలేముందో అందులో చూద్దాం పదండిరా" అంటూ ముందుకే వెళ్ళారు.

ఆ గుహ ద్వారంలో అడుగుపెట్టిన వారికి నిలువెత్తు ధనరాసి కనిపించింది. అది చూస్తూ కళ్ళు తిరిగిపోయిన వారు "ఆ పిచ్చివాడు ఇదా మృత్యుదేవత అన్నాడు" అని గొల్లున నవ్వుకున్నారు. తరువాత "ఇదంతా మనం నలుగురం సమంగా పంచుకొని హాయిగా బ్రతుకుదాం" అనుకున్నారు. అయితే ఆకలితో కడుపులు నకనకలాడుతున్నాయి కనుక ముందు తిండితిని తరువాత దీనిపని చూద్దాం" అనుకొని అందులో ఇద్దరు దగ్గిరే ఉన్న ఊరువెళ్ళి భోజనం తెచ్చారు. ఇద్దరు గుహలో నిధికి కాపలా ఉండేటట్లు తీర్మానించుకున్నారు.

వెళ్ళిన యిద్దరూ సుష్టుగా తిన్నారు. మిగిలిన యిద్దరికీ భోజనం ఆకుల్లో కట్టించి తీసుకున్నాక అప్పుడు వారికి ఒక దురాలోచన వచ్చింది. 'అంత డబ్బుని మనమిద్దరమే తీసుకుంటే బాగుంటుంది కనుక ఆ అన్నంలో విషం కలిపి తీసుకువెళ్తే వాళ్ళిద్దరూ యిది తిని చస్తారు. ఆపైన డబ్బంతా మనదే' అనుకున్నారు. అనుకున్న ప్రకారమే చేశారు. అక్కడ భోజనం తేవడానికి వీళ్ళు వెళ్ళగానే, గుహలో కాపలా ఉన్న ఆ యిద్దరూ 'వాళ్ళు తిరిగి వచ్చి గుహలో అడుగు పెడుతుంటేనే దుడ్డుకర్రలతో బాది చంపేస్తే పీడావదులుతుంది. మనమిద్దరమే ఈ ధనమంతా స్వంతం చేసుకోవచ్చు" అని ఆలోచించి అది అమలు జరిపారు.

ఆ యిద్దరూ చనిపోయారు. గుహలో ఉన్న యిద్దరూ ముందు ఆకలితీర్చుకోవటానికి అన్నం తిని తరువాత డబ్బుని పంచుకుందాం అనుకున్నారు. విషాహారం తిన్న దొంగలిద్దరూ చనిపోయారు. సాధువు గుర్తించిన మృత్యుదేవత అప్పుడు కూడ వికటాట్టహాసం చేసింది.

'వెధవ డబ్బు' అంటుంది లోకం. అది చెడ్డదేమీ కాదు ఆశాపాశబద్ధమైన మనస్సే చెడ్డది. కీడును తెచ్చి పెడుతుంది. మంచి బుద్ధికి సద్వినియోగపడిన డబ్బు పుణ్యం సంపాదించి పెడుతుంది. *

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

సంశయాలు ఉన్నవాడు ఎన్నడూ ఆత్మానుభూతిని పొందజాలడు అన్న సద్గురుదేవుల బోధను పురస్కరించుకుని భక్తులు సమయం, సందర్భం చూసుకుని సద్గురుదేవులకు తమ సందేహాలను నివేదించుకునేవారు. **ఆత్మానుభూతి** అంటే ఏమిటి? అనే సందేహం లేవనెత్తిన భక్తునికి సమాధానంగా బోధ చేస్తూ...........

ఆత్మానుభూతిని పొందటం అంత సులభం కాదు. అలాగని కలగక పోవటం అంటూ లేదు. అది మాహాత్ములు పొందే అనుభూతి. దానిని వారు అందుకోమంటారు. అందుకోవటానికి అది ఏమైనా వస్తువు కాదుగా! అందించేది ఎవరు? అందుకునేది ఎవరు? అది కేవలం అనుభూతే.

అక్కడ కర్తృత్వం లేదు. అక్కడ ఉన్నది నిశ్చలత, నిరంతరత మాత్రమే. అది తరిగి పోయేదికాదు, అంతరించేది కాదు. పరిణామము చెందేది కాదు. అది సత్యమైనది, నిత్యమైనది. ఆత్మానుభూతి మాటకు మనస్సుకు అందని సత్యం. అది సాధకుని అనుభూతి. సత్యసాక్షాత్కారము పొందక పోవటమే మరణము. దానిని సాధించని దేహము నిరుపయోగము.

ఆత్మానందములో ఓలలాడే జ్ఞానికి నమస్కారాలు, తిరస్కారాలు అంటవు. ఆయనది నివృత్తి మార్గం. అలాగని ఆయనని ఆశ్రయించిన వారి సుఖదుఃఖాలకు స్పందించని పాషాణ హృదయం కాదు వారిది. వారినుంచి వెలువడే ఆధ్యాత్మిక తరంగాలు వారివారి అవసరాలను బట్టి వారిని తాకి శాంతిని చేకూరుస్తాయి. సత్యసాధన, సత్యశోధన ఆత్మానుభూతికి సరియైన మార్గం.

నేను - నాది అనే అహంకార మమకారాలు వదులుకోవాలి. మనస్సు ఖాళీ అవ్వాలి. నేను - నాది కానిది ఏదో ఒక దివ్య శక్తి ~~ఈ~~ సర్వసృష్టిని నడిపిస్తోంది అన్నది గోచరించి నిన్ను నీవు తెలుసుకుంటావు. అదే అత్మానుభూతి. అదే ఎరుక.

*

(గతసంచిక తరువాయి)

# శివానందలహరి

-బులుసు మల్లిక్ U.S.A

3. ***త్రయీవేద్యం హృద్యం త్రిపురహరమాద్యం త్రినయనం
జటాభారోదారం చలదురగహారం మృగధరమ్
మహాదేవం దేవం మయి సదయభావం పశుపతిం
చిదాలంబం సాంబం శివమతివిడంబం హృది భజే ॥***

మూడవ శ్లోకంలో శివచిహ్నాల జాబితాని మనకందిస్తున్నారు. ***త్రయీ వేద్యం*** అంటూ వేద సంపుటిని ప్రస్తావిస్తున్నారు. మరి మూడువేదాలేమిటి? మనకి తెలిసినవి నాలుగు కదా! కాదు కాదు. కొంచెం ఆలోచించండి. వేదాన్ని రాశులుగా నిర్ణయించింది వేదవ్యాసులవారు కదా! అంటే అంతకుపూర్వ మున్నది వేదము ఒక్కటే. అందులో ఉండే మంత్రాల పరంగా వేదాల్ని పలికిస్తే ఋక్కులు, యజస్సులు మరియు సామములు అనేవి మనకు లభిస్తాయి. ఇవే నాలుగు వేదాలలోనూ వివిధపాళ్ళలో ఉంటాయి. అందుచేత వేదాన్ని ***త్రయీవిద్య*** అనికూడా అంటారు.

ఈ వేదసంపుటిచే వేద్యుడైన బ్రహ్మమొక్కటే. పరబ్రహ్మమొక్కటే. ఉదాహరణకి ఒక లక్షాధికారి తన బ్యాంకులో ఉన్న సొమ్మును విభజించి ఒక్కొక్క చోట పాతికవేలు చొప్పున నాలుగు బ్యాంకులలోకి వేసుకున్నాడు అనుకుందాం. అలా చెయ్యడం చేత ఆయన వేలాధిపతిగా మారిపోయాడు. నిజానికి ఆయన ఇంకా లక్షాధికారే. అలాగే వేదరాశి ప్రతిపాదించే సత్యము లేక పరబ్రహ్మము ముమ్మాటికీ మారిపోదు. ఆయనే ఆద్యుడు కావటం చేత ***ఆద్యం*** అని సంబోధిస్తున్నారు. ఆయనే సృష్టికర్త. అంతేకాదు. అంత్యంలో మిగిలిపోయేదీ ఆయనే. దీనికి మహానారాయణోపనిషత్తు ఏమంటోందంటే ***యో వేదాదౌ స్వరః ప్రోక్తో వేదాంతేచ ప్రతిష్ఠితః తస్య ప్రకృతిలీనస్య యః పరస్సపరమేశ్వరః।*** వేదాదిలో ఓంకారమై వెలయువాడు వేదాంతవనంలో మరింత దృఢంగా ప్రతిష్ఠింపబడినవాడూ ఆయనే. ఈ చరాచరజగత్తునకు వేదికయై ఉన్నాడు. జగత్తులయమై పోవచ్చు. కాని వేదిక మాత్రం చెక్కుచెదరదు.

ఇంకా ***హృద్యం*** అంటున్నారు. అంటే అంతర్ముఖులైన వారికి హృదయ కమలముల యందు ప్రతి నిత్యము వెలయువాడు. ఆయనే ***త్రిపురహరం.*** అంటే స్థూల సూక్ష్మ కారణ శరీరాలను విచ్ఛేదించి అందు

దాగిన తత్త్వాన్ని దర్శింపజేయువాడే ఈశ్వరుడు. స్వయం ప్రకాశకుడు ఆయనే ముక్కంటి కాబట్టి ***త్రినయనం.***

గంగావతరణ తరుణంలో గంగయొక్క అహంకారపతనం గావించలేదా? ఆ సమయంలో గంగని తన జటాజూటములో నిర్బంధించాడు కదా! అయితే అది కరుణతో మరియు అనిర్వచనీయమైన వాత్సల్యంతో అని మనం గ్రహించాలి. అలా ఉదార్స్వభావుడు కావడం చేత ***జటాభారోదారం.*** దశకంఠుడు కూడా శివతాండవ దర్శనంలో ముందస్తుగా శివుని ఉద్దేశించి ***జటాటవీగలజ్జల ప్రవాహపావితస్థలే*** అని కొనియాడతాడు. తదుపరి శివుడు చీకటిలో నుంచి వెలుగులోకి మనల్ని తీసుకెడతాడు. ఎందుకంటే రజ్జుసర్ప భ్రాంతి వినిర్మూలం కావాలంటే ముందస్తుగా అపోహ తొలగాలి. అప్పుడు పాము కూడా రజ్జువులాగా భాసిస్తుంది. భయానికి తావే ఉండదు. అలా ఆశ్రితుల భ్రాంతిని పటాపంచలు చేస్తాడు. కనుక చిహ్నంగా ***చలదురగహారం.*** ఇకపోతే జింక చాపల్యానికి సంకేతం. మరి శివుడో! జింకని పట్టుకొని కనిపిస్తుంటాడు. బుద్ధిచాపల్యాన్ని పోగొట్టువాడు కనుక ***మృగధరం.*** అలా తప్పదారులు తొక్కకుండా మనల్ని నిరంతరం కాపాడుతూ మార్గదర్శియై జాగ్రత్త వహిస్తాడాయన. అయ్యవారు ముగురయ్యల మూలపుటయ్య చాలపెద్దయ్య కాడా? అలా త్రిమూర్తులకే మూలమైన మూర్తికావడం చేత ***మహాదేవం***. అలాగే త్రిమూర్తులలో ఒక మూర్తి కావడంచేత ***దేవం.***

కామాదులనే పాశాలచే బద్ధులైన జీవులందరికీ పాశవిమోచనం గావింపజేసి స్వేచ్ఛనూ, స్వచ్ఛందమైన ఆనందాన్ని ప్రసాదిస్తాడు కాబట్టి ***పశుపతిం***. ఎందుకని? వేరే కారణం లేదు. కేవలం మనల్ని కరుణతో ఉద్ధరించాలనే తపన కలిగి ఉండటం చేత ***మయినదయభావం***. ఎలాగ? జ్ఞానం ద్వారా? ఎంచేతనంటే జ్ఞానాదేవతు కైవల్యం అనికదా ఆర్యోక్తి. అందుచేత ***చిదాలంబం***. ఆయనే ***సాంబం***. ఎల్లవేళలా అమ్మతో కలసి మనల్ని రక్షిస్తుంటాడు. అంతేకాదు ఇంకా అవసరాన్నిబట్టి యింకా ఎన్నో రూపాల్లో వస్తాడు కాబట్టి ***అతివిడంబం***. కాని అన్నిటికీ మూలం శివుడే అని చెబుతూ తుదిగా ***శివం*** అంటున్నారు. అటువంటి మంగళకరమైన చిహ్నాలతో కూడినటువంటి గొప్పతత్త్వాన్ని భజించేందుకు మనహృదయం వేదికకావాలనే కర్తవ్యాన్ని మనకు గుర్తుచేస్తూ ***హృది భజే*** అని అంటున్నారు ఆదిశంకరులు. ఆ శివానందానికి మనమందరమూ పాత్రులౌదాం! తరిద్దాం!!

# బాబూజీతో అనుభవాలు

-శ్రీ రెడ్డి సత్యనారాయణ మూర్తి

1959 ఆగస్టు నెలలో గోదావరి నదికి వరదలు వచ్చినాయి. నీరు కట్టలను ఒరుసుకుంటూ ప్రవహిస్తున్నది. నదీదేవి సర్వాలంకార శోభితయై తన పతి దేవుడైన సాగరుణ్ణి చేరుకోవడానికి తరలి వెళ్తున్నట్లుగా ఉన్నది.

నదిపై రాకపోకలు నిలిచి పోయినవి. ఏ క్షణాన ఏమి ప్రమాదం జరుగనున్నదోనని ప్రభుత్వ సిబ్బంది అప్రమత్తతో కాపలా కాస్తున్నారు. నదీ తీరవాసులు భయగ్రస్తులై గుండెలు పిడికిట పట్టుకున్నారు. ఈ లోకవాసన ఎరుగని శిశువులు తప్ప అందరూ భయవిహ్వాలతకు లోనయ్యారు.

రాత్రి 11 గంటల సమయం. మబ్బు వలన చీకటి మరింత అంధకారాన్ని పులుము కొన్నది. వర్షం కురువ సాగింది. భయగ్రస్తులమైన మాకు నిద్ర పట్టడం లేదు. ప్రమాదాన్ని ఊహించుకుంటూ సర్వాన్ని మరచిన స్థితి అది. ఆ సమయంలో తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. లేచి వెళ్ళి తలుపు తెరిచాను. ఎదురుగా మా ప్రత్యక్షదైవమైన బాబు!

వారి దర్శన మాత్రంతో అప్పటి వరకు మా మనస్సులలో గూడు కట్టుకున్న భయం ఏమైపోయిందో ఆనందతరంగాలు నాట్యమాడాయి. అభయ ప్రదాత చెంత భయానికి తావెక్కడ? భక్తవత్సలుడైన ఆ భగవానుడు మా భయాన్ని పారద్రోలడానికే ఆ సమయాన విచ్చేసి ఉంటారు.

దంపతులిద్దరం వారిని లోనికి తోడ్కొని వెళ్ళి, పాదప్రక్షాళన చేసి, సుఖాసీనులను చేసి వారి కోర్కె మేరకు క్షీరాన్ని కాచి యిచ్చాము. వారు మా కుశలాన్ని అడుగుతూ క్షీరాన్ని గ్రోలారు.

మాటల సందర్భంలో వారు కాకినాడ నుండి వస్తున్నట్లు , ముంజవరపు కొట్టు వెళ్ళవలసి ఉన్నదని సెలవిచ్చారు.

"నదిని దాటటానికి అవకాశం లేని ఈ సమయంలో తమరు ఎలా వెళ్తారు? రాకపోకలు సాగేవరకు తమరు ఇచ్చటనే ఉండండి" అంటూ వారించాము. వారు ససేమిరా కాదని ప్రయాణమయ్యారు. వీడ్కోలుగా నేను కూడా వారి వెంట బయలుదేరాను. కొంత దూరం వెళ్ళాక "మీరిక వెళ్ళండి.

ఈ చీకటిలో నాతో ఎంత దూరం రాగలరు?'' అంటూ ఆజ్ఞాపించారు. వారి ఆజ్ఞను ఔదల దాల్చి ఇంటికి మరలిపోయాను.

ఈ సమయంలో బాబు ముంజవరపుకొట్టు వెళ్ళటం సంభవమా? అనే సంశయం నన్ను పట్టి పీడించసాగింది. నాలుగురోజులు గడిచాయి. వరద తగ్గుముఖం పట్టింది. నదిమీద పడవల రాకపోకలు ప్రారంభమయ్యాయి. నేను పడవ ద్వారా నదిని దాటి, ముంజవరపుకొట్టు భక్తుని యింటికి వెళ్ళాను. కుశల ప్రశ్నలు అయ్యాక ఆ భక్తుని అడిగాను. ఫలాన రోజున బాబుగారు మీ యింటికి ఎప్పుడు వచ్చారు? అని. ఆ రాత్రి 2 గంటలకు వచ్చి, మరునాడు ఉదయం 9 గంటలకు తిరిగి వెళ్ళినట్లుగా వారు చెప్పారు. నేను అబ్బుర పడ్డాను ఇదెలా సంభవం?

కంసుని జైలు నుండి యశోద పొత్తిళ్ళలోకి పయనమై వెళ్తున్న చిన్నారి కృష్ణునికి యమునా నది పాయలుగా చీలి దారి యిచ్చినట్లు , గోదావరిమాత బాబుకి దారి ఇచ్చిందా? లేక సర్వ వ్యాపియైన భగవంతుడు ముంజవరపు కొట్టులో రూపం ధరించి ఆభక్తుని యింటికి వెళ్ళారా? ఏమో ఎవరు చెప్పగలరు? భగవంతుని లీలలు!!

ఒక ధనవంతుడి యింట్లో పెళ్ళి ఊరేగింపు జరుగుతోంది. బాణా సంచా కాలుస్తున్నారు. లోపల ప్రేలుడు మందు కూరి ఒక ఏనుగును తయారు చేశారు. నిప్పు అంటించగానే అది ఆకాశంలోకి ఎగిరి పెద్ద శబ్దంతో పేలిపోతుంది. దానిని చూడటానికి జనం విశేషంగా మూగారు. "ఏనుగును తయారుచేశారుగాని ఏమంత బాగాలేదు. చెవులూ తోకా బాగా రాలేదు " అన్నాడు ఒకడు. ఈ మాటలు విన్న ప్రక్క ఆసామి అన్నాడు "స్థిరంగా పెట్టుకోవటానికైతే నువ్వు చెప్పిన మాట నిజమే. క్షణంలో నిప్పుపెట్టి కాల్చేసేదానికి ఎలా ఉంటే ఏం?''

సృష్టిని గురించి చెప్పే అనేక వాదాలు విరుద్ధంగా, లోపభూయిష్టంగా కనిపిస్తాయి. సృష్టిని గురించి చెప్పటం సృష్టి సత్యమని చెప్పటానికి కాదు. అది మిథ్య అని చెప్పటానికే. అందుకే ఆ వైరుధ్యం.

-విచారసాగరం ఆధారంగా

## నామహోమం విశిష్టత

- జి.వి.

"ఒక వ్యక్తి నీపైనే తన మనస్సుని ఎలా లగ్నం చేయగలడు?" అని వ్రజవాసులు శ్రీకృష్ణుని ప్రశ్నించారు. ఆయన వెంటనే 'ఓం కృష్ణ ఓం కృష్ణ కృష్ణాయ నమః" అనే మంత్రాన్ని వారికి ఉపదేశించారు. "ఈ మంత్రాన్ని జపించటంలో నియమాలు, ఆంక్షలు, లక్షణాలు ఏమైనా ఉన్నాయా?" అని వారు తిరిగి ప్రశ్నించారు. "ఎటువంటి నియమాలు, లక్షణాలు, ఆంక్షలూ లేవు. ఎప్పుడైనా, ఎక్కడైనా, మీరు ఏ స్థితిలో ఉన్నప్పటికీ మీరు ఈ మంత్రాన్ని ఉచ్చరించవచ్చు. ఎందుకంటే ఏదీ కూడా ఈ మంత్రాన్ని కలుషితం చేయలేదు. ఈ మంత్రం అగ్నిలా అతి పవిత్రం. అగ్నికన్నా శక్తి ప్రదమైనది. ఎందుకంటే అగ్ని వస్తుజాలాన్ని తప్ప కర్మ సంచితాన్ని, పాపకర్మలాన్ని దగ్ధం చేయలేదు. ఈ కృష్ణ మంత్రం వాటిని కూడా భస్మీపటలం చేస్తుంది" అని శ్రీకృష్ణుడు వారికి సమాధానం చెప్పాడు.

వ్రేపల్లె ప్రజలకు శ్రీకృష్ణుని యందు సంపూర్ణ విశ్వాసం ఉంది. శ్రీకృష్ణుని పలుకులను శిరసా వహించి, ఆయన చెప్పినట్లు ఆచరించారు. అరణ్యంలోని మృగాలన్నీ అంటే దుర్గుణాలన్నీ నామహోమంలో దగ్ధమైనాయి. నాలుగు అంతరేంద్రియాలు అంటే మనస్సు బుద్ధి చిత్తం అహంకారం యివి సత్యం శాంతి దయ ప్రేమగా రూపాంతరం చెందుతాయి.

**నామ హోమం** విశిష్టత ఏమిటంటే దీనికి ఒక పైస కూడా ఖర్చు పెట్టనక్కర్లేదు. ఇంటి వద్ద, కార్యాలంలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ యీ నామ హోమం జరపవచ్చు. విధి నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు రాకుండా యీ మంత్ర జపం కాపాడుతుంది. ఎటువంటి సంక్లిష్ట  సమస్యలు గాని, సంక్షోభాలూ కానీ ఏమీ చేయలేవు. ఈ నామ జపం సురక్షితంగా అటువంటి సంక్షోభాల నుండి వ్యక్తులను రక్షిస్తుంది.

బహుశ ఏ వ్యక్తి అయినా రాబడి పన్ను నుండి అమ్మకం పన్ను నుండి తన్నుతాను కాపాడుకోవచ్చు. కారాగారం నుండి, రుగ్మతలనుండి తప్పించుకో వచ్చు. కాని ఆ వ్యక్తి యొక్క కుమారుడు హఠాత్తుగా అకాల మరణం పాలైతే దాన్ని నుండి తప్పించుకోగలడా? కాని ఆధ్యాత్మిక శక్తి ఏ కష్టాన్నైనా, ఏ ప్రమాదాన్నైనా నివారించగలదు.

ఎవరైనా ఆ ఆధ్యాత్మిక శక్తిని ఆశ్రయిస్తే అతనికి పూర్తి రక్షణ

కలుగుతుంది. ఈ ఆధ్యాత్మిక శక్తి ఏ యింట్లో ప్రవేశిస్తుందో ఆ యింట్లో కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు, సఖ్యత, సామరస్యం విలసిల్లుతాయి. ముందు యింట్లో అటువంటి **సామ్యవాదాన్ని** సాధించకపోతే సమాజంలో సామ్యవాదం రాదు. అహిక వాంఛలను మనసా ముందు త్యజించాలి. కొందరు వ్యక్తులు శంఖ చక్రాల గుర్తులు తమ శరీరం మీద ముద్రించుకుంటారు. కాని ఆ ముద్రలను మనస్సుపైన వేసుకుంటే ఎంత ఉత్తమమం! గోపికలు చేసింది ఆపనే. కృష్ణుని భక్తుడైన ఉద్ధవుడు గోపికల అనన్య భక్తికి తన్మయుడై అత్యంత నమ్రతతో - బృందావనంలో ఏ రెమ్మగానైనా, యిసుకు రేణువుగా నైనా పుట్టాలని కోరుకుంటాడు.

బాలకృష్ణుని అవతారం ఆయన అతిమానుష లీలలను, మహిమలను విన్న ఒక పండితుడు ఆయన్ను చూడాలనుకొని వ్రేపల్లెకు వెళ్ళాడు. కాని ఆ పండితుడు కృష్ణుణ్ణి చూసి యాదవ బాలకునిగా తలచాడు. ఆయన తరువాత వంట వండుకుని భుజించటానికి ముందు 'కేశవా!' అని జపించాడు. వెంటనే కృష్ణుడు ప్రత్యక్షమైనాడు. తన ఆహారం కలుషితమైందని ఆ బ్రాహ్మణుడు యశోదకు ఫిర్యాదు చేశాడు. "నీవక్కడకెందుకెళ్ళావు?" అని కృష్ణుణ్ణి అడిగింది యశోద. ఆ బ్రాహ్మణుడు తనని పేరుపెట్టి పిలిచాడని కృష్ణుడు జవాబిచ్చాడు. కానీ జ్ఞానోదయం కలగని ఆ బ్రాహ్మణుడు తిరిగి తలుపులు బంధించి వంట వండుకున్నాడు. కానీ తిరిగి బాలకృష్ణుడు ప్రత్యక్షమైనాడు. మూడవసారి కృష్ణుడు ఆ బ్రాహ్మణునిపై దయతలచి ఆయనకు జ్ఞానోదయం కలిగించాడు. భగవంతుని నామం జపించినప్పుడల్లా కృష్ణుడు ఎందుకు ఆ పిలుపును అందుకుంటున్నాడు అని ఆయనకు అవగాహన అయింది. "ముందు ఆ ఆహారాన్ని నువ్వే ఆరగించాలి. భుక్త శేషాన్ని నాకు ప్రసాదించు. కేవలం పాండిత్య ప్రకీర్ష నిరర్ధకం" అని ఆ బ్రాహ్మణుడు కృష్ణుణ్ణి ప్రార్థించాడు.

ప్రజలందరి శ్రేయస్సుకోసం మహాత్ముడైన వ్యక్తి ఎప్పుడు తహతహ లాడుతుంటాడు. ఆయన మన మానసిక వేదనను, శారీరక బాధలను నివృత్తి చేసి, లక్ష్యార్థముద్రను అనుగ్రహిస్తాడు. ఆ మంత్రాన్ని జపించినప్పుడు సకల పాపరాశి భస్మీపటలం అవుతుంది. శ్రీకృష్ణ నామాన్ని జపిస్తూ బోధలబాబా ఒక మృతుడిని స్పృశింగానే అతడు పునర్జీవితుడవుతాడు. సత్య గురువు మహిమలు అటువంటివి.

# పురుషోత్తమ ప్రాప్తి యోగము

- వెంకట రమణ ప్రసాద్

1. ఈ సంసార వృక్షము ఊర్ధ్వమూలము. ఊర్ధ్వ అను మాటకు శ్రేష్ఠమైన ఉత్కృష్టమైనది అని అర్థం.

2. మాయ పరబ్రహ్మలో కల్పింపబడినది. పరబ్రహ్మం నుండి మాయ కల్గలేదు. పరబ్రహ్మమునకు మాయను కల్పిస్తే నిర్వికారత్వానికీ, నిష్క్రియత్వానికి భంగం కలుగుతుంది.

3. సంసార వృక్షం తలక్రిందుల వృక్షం. వంశ వృక్షాలను తలక్రిందులుగా వ్రాసే పరిపాటి కూడా ఉంది.

4. 'శ్వ' అనగా రేపు. రేపటి వరకు ఉండేది 'శ్వత్థం'. న శ్వత్థం - అశ్వత్థం. రేపటి వరకు కూడా ఉండనిది. అనిత్యమూ క్షణికమూ అని దీని అర్థం. "ఇది రావి చెట్టు. అంతా తొఱ్ఱ. తినటానికి పళ్ళు ఉండవు. వాసన చూడటానికి పువ్వులు ఉండవు. దీని ఆకులు కూడా దేనికీ పనికి రావు" అన్నాడు జ్ఞానేశ్వరుడు.

5. వేదాంతుల పరిభాషలో యీ జగత్తు దృష్ట, నష్ట స్వరూపం కలది. అక్షరాలు ఒక పక్క పుడుతూ ఉంటే ఒక ప్రక్క నశించి పోయినట్లు.

6. రావిచెట్టుకు 'చలదళ'మనే యింకో పేరు ఉంది. దీని ఆకులు నిరంతరం చలిస్తూనే ఉంటాయి. మానవుడి కోరికలూ, జీవితమూ కూడా అంతే.

---

'బుద్ధి కర్మానుసారిణి' అని అందరూ అంటారు. బుద్ధి కర్మను అనుసరిస్తే అనుసరించుగాక. కానీ నీవు బుద్ధివి కాదుకదా! కర్మకు కర్తవైన నీవు కర్మకు అధీనంగా ఉండనక్కర్లేదు.

తలలో కల కల్పించబడినట్లు, పరమాత్మలో యీ జగత్తు కల్పించబడింది.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

యనమదుర్రులో యమధర్మరాజ ప్రతిష్ఠితమైన శక్తీశ్వరాలయం ఉంది. స్వామి శీర్షాసనంలో పద్మాసనం వేసి, శిరస్సుపై నిలిచి ఉంటారు. ప్రక్కనే అమ్మ పార్వతీదేవి కుమారస్వామిని ఒడిలో పెట్టుకుని కూర్చుని ఉంటుంది. ఇద్దరు మూర్తులూ ఒకే పీఠంపై ప్రతిష్ఠితమై ఉండటం ఇక్కడ ప్రత్యేక విశేషం. ఆలయానికి ఎదురుగా ఉన్న తటాకములోని నీరు మహామహి మాన్వితమైనదని సర్వాభీష్ట ప్రదాయకమైనదని, కాశీనుండి అంతర్వాహినిగా వచ్చి, గంగ యీ తటాకంలో కలుస్తుందని ప్రజల గాఢవిశ్వాసము. శ్రీబాబు యనమదుర్రులో ఉన్నపుడు తరచుగా



'వాకింగ్' (వ్యాహ్యాళి) చేస్తూ ఈ ఆలయం వద్దకు వచ్చేవారు.ఆలయంలోని స్వామికి నివేదన చేసే అన్నము ఆ తటాకపునీటితో అయితేనే ఉడుకుందని, ఎంత మంచినీళ్ళైనా, వేరేనీటితో ఉడకదని అర్చకులు చెప్తారు.

శ్రీబాబు నిజతత్త్వాన్ని శ్రీ పరశురామయ్యగారు గ్రహించినంతగా, వారి కుటుంబ సభ్యులెవరూ గ్రహించలేదు. శ్రీమతి చుక్కమ్మగారు, వారి చెల్లెలు శ్రీమతి కందర్ప సుబ్బమ్మగారు (కందర్ప వెంకటకృష్ణయ్యగారి భార్య) కొంతవరకు గ్రహించారు. సుబ్బమ్మగారిని 'వడాలి పిన్ని' అని అందరూ పిలిచేవారు. దానికి కారణం శ్రీబాబు ఆమెను ' పిన్ని' అని పిలవటం, ఆమె వడాలి గ్రామంలో వారణాసివారి ఆడబడుచు కావటం. ఆమెకు జ్ఞానతృష్ణ ఉన్నది. పరశురామయ్యగారినే తమ గురుదేవులుగా పూజించుకుంటూ, వారివద్ద రెండు మంత్రదీక్షలు పూర్తి చేసింది.

తమ తండ్రిగారైన శ్రీరాములుగారి శిష్యవర్గంవారు ఎక్కడైనా, ఎప్పుడైనా శ్రీసద్గురుపూజగాని ఆరాధనగాని జరిపితే, శ్రీ పరశురామయ్యగారు కూడ వెళ్ళేవారు. అలాగే ఒకసారి బెజవాడలో ఒక భక్తుని ఇంట జరిగే ఆరాధనకు శ్రీ పరశురామయ్యగారు వెడుతూ, శ్రీబాబును వడాలి పిన్నిగారిని కూడ తీసుకువెళ్ళారు. ఆమెకు ఆరోజు మూడవ మంత్రదీక్ష యివ్వవలసి ఉంది.

అయితే ఆమె ఒక్కరే, భర్తగారిని తీసుకురాకుండా వచ్చారు. ఆయనను శ్రీ బాబు, 'బాబాయి' అనేవారు. అప్పుడు బాబాయి గన్నవరంలో ఉంటున్నారు. పిన్నికి ఉన్నంత జిజ్ఞాస ఆయనకు లేదు. పిన్నికి శ్రీబాబు దర్శనం లభించటం అదే ప్రథమం.

ఆ సమయంలో శ్రీ బాబు ఒక ప్రశ్న లేవనెత్తారు. "పతివ్రత అయిన స్త్రీకి భర్త లేకుండా తాను ఒక్కతే మంత్రదీక్ష తీసుకునే అర్హత ఉన్నదా?" అని. పతినే పరమగతిగా సేవించే స్త్రీకి, తన పతితో కలిసి కాక, ఒంటరిగా చేయదగిన వ్రతముగాని, పూజగాని, దీక్షగాని ఏమున్నది? అలాగని, ఆధ్యాత్మిక విద్యను అర్థించి వచ్చిన తృష్ణ గల వారికి విద్యను నిరాకరించ వచ్చునా? ఈ సమస్యనెవరు పరిష్కరించగలరు? ఇంచుమించు సాయంకాలం వరకు ఆ భక్తులమధ్య తర్జన. భర్జనలు కొనసాగాయి. కాని పరిష్కారం దొరకనే లేదు. 'పిన్ని' మాత్రము మంత్రదీక్ష కోసం ఎంతో తపన పడుతున్నారు.

చివరకు అనుగ్రహస్వరూపులైన శ్రీబాబు, తమ ప్రశ్నకు తామే జవాబు చెప్పి, పరమధర్మరూపమైన పరిష్కారమును అనుగ్రహించారు. "ఆకలిగొన్న వారికే అన్నం పెట్టాలి. ఆకలి లేనివాడికి అన్నం పెడితే, అది వాడికి అపకారం చేస్తుంది. ప్రాపంచిక విషయమైన 'ఆకలి' తీర్చటానికే ఈ నియమం ధర్మమైనపుడు, ఆధ్యాత్మికంగా తీవ్రమైన జిజ్ఞాస (ఆకలి) గల వ్యక్తి విషయంలో ఆ జిజ్ఞాసను ( ఆకలి) తీర్చటమన్నది పరమ ధర్మము. పిన్ని, బాబాయి యిద్దరు పరశురామయ్యగారివద్ద మొదటి మంత్రదీక్ష తీసుకున్నారు. కాని పిన్ని శ్రద్ధాసక్తులతో మంత్రానుష్టానము చేసి సిద్ధిని పొందింది. బాబాయిలో ఆ శ్రద్ధ అంతంతమాత్రంగానేఉంది. అయినా రెండవదీక్షకోసం పిన్ని ఆరాటపడితే, రెండవదీక్షకూడా యిద్దరికి యివ్వటం జరిగింది. ఆ దీక్షను కూడా పిన్ని చక్కగా పూర్తి చేసి మూడవ దీక్ష కోసం ఆరాటపడుతూ వచ్చింది. బాబాయి మాత్రం రెండో దీక్షను పూర్తి చేయలేక పోయారు. ఆకలి లేక రాని వారి కోసం ఆకలి గొని వచ్చియున్న ఈమెకు ఆహారం ఇవ్వక పోవడం ధర్మం కాదు. అందుచేత పిన్నికి మూడవ దీక్ష ఇవ్వటమే ధర్మము". అని తేల్చి చెప్పారు. అంతటితో అందరి మనస్సులు తేలిక పడ్డాయి.

-సశేషం

# బ్రహ్మాన్ని పట్టుకుంటే బ్రహ్మమే అవుతావు!

-కొండ వెంకట్రాజు

మహారాజుని పట్టుకున్నవాడు మహారాజైయ్యాడు. బ్రహ్మాన్ని పట్టుకున్న వాడు బ్రహ్మమే అయ్యాడు - పార్థ సారథి గారి ఆంగ్ల పుస్తకం నుండి.....

ఒక మహారాజు ఉన్నాడు. ప్రజారంజకంగా రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. ప్రజలు సుఖసంతోషాలలో ఓలలాడుతున్నారు. రాజుగారికి వృద్ధాప్యం వచ్చేసింది. ఆయనకు వంశోద్ధారకుడు లేడు. రాజుగారికి తన తదనంతరం ఎవరిని రాజుగా చేయాలి? అన్న సమస్య ఎదురైంది. రాజుగారు ఒక ఉపాయం ఆలోచించాడు. మంత్రులను, సేనాధిపతులను పిలిచి ప్రపంచంలో కనీవినీ ఎరుగని, ఒక పెద్ద ప్రదర్శనశాల పెట్టమన్నాడు. అందులో రాజుగారు మారువేషంలో ఎక్కడో ఉంటారు. ఎవరైతే వారిని గుర్తించి పట్టుకుంటారో, వారిని రాజుగా చేస్తానని ప్రచారం చేయించాడు.

ఒక పెద్ద ఆవరణలో ప్రదర్శనశాల మొదలైంది. అందులో అన్నిరకాల వింతలూ చేర్చబడ్డాయి. పెద్ద బట్టల దుకాణాలు, నగల దుకాణాలు, ఆటలూ, పాటలూ, కుస్తీ పోటీలు, వాటర్‌ఫాల్స్, సర్కస్‌లు మొదలైనవి ఎన్నో! రాజుగారు తలచుకుంటే కొదవేమిటి? ఒక మినీ ప్రపంచం తయారైంది. ప్రజలందరూ ప్రదర్శనశాలకి వచ్చారు రాజును గుర్తించటానికి. ఆ ప్రదర్శనశాలలోని వింతలు చూస్తూ వారు రాజును గుర్తించే విషయమే మరచిపోయారు! శ్రద్ధ తక్కువై పోయింది. చివరికి శ్రద్ధ ఆవిరైపోయింది. ప్రదర్శనశాలలో ఉన్న నగలు, వస్తువులు అతి చవకగా కొనేసుకుంటున్నారు. అక్కడి వింతలు చూస్తూ మైమరచి పోయారు. రాజుగారు రచించిన మాయలో తెలియకుండానే కూరుకు పోయారు.

ఒక యువకుడు విసుగు విరామం లేకుండా రాజుగారినే వెతుకుతున్నాడు. అక్కడ వింతలలో తగులుకోకుండా ఓపిగ్గా శ్రద్ధగా వెతుకుతున్నాడు. ఆఖరికి చివరలో ఉన్న ఒక చిన్న గుడికి వెళ్ళాడు. గుళ్ళో జనం అంతగా లేరు. ఎప్పుడూ చూసే గుడే కదా అని ఎవరూ గుడికి వెళ్ళటం లేదు. గుళ్ళో పూజారి పూజలు చేసి, హారతిలు యిచ్చి, వచ్చిన ఆ కొద్ది మంది భక్తులు ఆశీర్వదించి పంపుతున్నాడు. మన యువకుడు తన లక్ష్యాన్ని యింకా పట్టుకునే ఉన్నాడు

కదా! ఆ పూజారిని నిశితంగా చూసి ఆయనే రాజని గుర్తించాడు!

ఆ యువకుడు రాజును గుర్తించి రాజైయ్యాడు. ప్రదర్శనశాలకు వచ్చిన వారందరూ వింతలలో ఊరి ఉండటం వలన మాయలో పడి బ్రహ్మాన్ని (రాజుని) గుర్తించలేకపోయారు.

అలాగే మనం కూడా యీ మాయ ప్రపంచంలో ఉన్న కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు అనే విషయాదులలో తగులుకోకుండా ఆ యువకుడిలాగ లక్ష్యాన్ని వదలకుండా శ్రద్ధగా వెతికితే బ్రహ్మ వస్తువు దొరుకుతుంది. **బ్రహ్మాన్ని పట్టుకుంటే బ్రహ్మమే అవుతావు** అని మహాత్ములు చెబుతున్నారు.

చాలమంది యీ ప్రపంచమనే ప్రదర్శన శాలలో దొరికే చిన్న పెద్ద సుఖాలకు అలవాటు పడిపోయి వదులుకుందామని అనుకున్నా వదులుకోలేక, బ్రహ్మ వస్తువు ఒకటి ఉన్నదని తెలిసినా, తెలుసుకుందామని కొద్ది ప్రయత్నం చేసి, మళ్ళీ మాయలో పడి, మాయలో ఎప్పుడు జారుకున్నామో కూడా తెలుసుకో లేక పతనమవుతారు.

మనం సత్పురుషుల నుండి సద్గ్రంథాల నుండి గ్రహించిన విషయాన్ని శ్రద్ధగా సాధన చేయాలి. గుఱ్ఱాన్ని చెరువుదాకా తీసుకెళ్ళగలం. దాని దాహం తీరాలంటే దాని కృషి అవసరం. ఆ కృషిని చిగురింపజేసి, అభివృద్ధి పరచటానికి గురువుల అవసరం ఎంతో ఉంది. శ్రీబాబూజీ ఆశ్రమంలో ఏర్పరచిన వాతావరణంలో యీ ప్రయత్నం సాకారం చేసుకుందుముగాక!

ప్రయత్నం మన వంతు ఫలితం గురుదేవులే ప్రసాదిస్తారు.

## కఫాన్ని నివారించండి

పీష్వా మాధవరావుకు అంత్యకాలం ఆసన్నమైంది. కఫంతో గొంతు మూత పడ్డది. "కఫాన్ని నివారిస్తే అతిసారం వస్తుంది. అతిసారం నివారిస్తే కఫం వస్తుంది. దేనితో అయినా చావు తప్పదు'' అన్నారు డాక్టర్లు.

"అతిసారంతో చచ్చినాసరే, కఫాన్ని నివారించండి. భగవన్నామం ఉచ్ఛరిస్తూ ప్రాణాలు వదులుతాను అన్నాడు మాధవరావు.

(గతసంచిక తరువాయి)

# అపరోక్షానుభూతి

-పరాశర ప్రసాద్

జాగ్రత్స్వప్నావస్థలలో మనస్సు ఉంది కాబట్టి సుఖదుఃఖాలు ఉంటాయి. సుషుప్తిలో మనస్సు లేదు. మనస్సు యొక్క భావ అభావములు తెలుసుకునే వాడిని 'నేను'. మనస్సుకి ద్రష్టని 'నేను' అని గుర్తించాలి. తింటే శక్తి వస్తుంది. వింటే ముక్తి వస్తుంది. మానవుడికి భద్రమైన చెవులు యిచ్చి, భద్రమైన విషయాలు వినే శక్తినిచ్చాడు భగవానుడు. పరబ్రహ్మ వస్తువు చెదరనిది, చలనము లేనది. దాని గురించి ఎంత వరకు వినాలి? కాల నిర్ణయం లేదు. దీర్ఘకాలం వినాలి. మనస్సు చంచలత్వము పోయే వరకు వినాలి.

అపరోక్షానుభూతిని సాధించటానికి సాధన చతుష్టయ సంపత్తి అవశ్యము. ఇహలోక పరలోక సుఖముల యందు అనాసక్తియే వైరాగ్యము. నిత్యానిత్య వస్తు వివేకము వైరాగ్యానికి దారి తీస్తుంది. అప్పుడు శమదమాది షట్కసంపత్తిని సాధించగలుగుతాడు. వాసనా త్యాగమే శమము. నిద్రలో ఏ వాసనలూ లేవు. జాగ్రత్స్వప్నావస్థలలో త్యాగము చేయగలగాలి. పూర్వజన్మలో వాసనలే యీ జన్మలో భోగాలు. కర్మశేషము వాసనా రూపంలో యీ జన్మకి కారణం అవుతుంది. జన్మ వస్తే కర్మ తప్పక చేస్తాడు. కర్మ చేయకుండా వీలులేదు. కర్మ చేస్తే ఫలం తప్పదు కదా! ఫలాన్ని అనుభవించటమే భోగం. కాబట్టి కర్మ ఫలాన్ని త్యాగం చేస్తే వాసనా రహితమవుతుంది. జన్మ, కర్మ, ఫల, భోగ, వాసన అనే గొలుసులో వాసన అనే లింకు తీసివేయగలిగితే జన్మరాహిత్యము సాధ్యపడుతుంది.

శ్రీరమణ మహర్షికి భక్తులు గులాబీ పూలు సమర్పిస్తే, ఆ పూలని చేతిలోకి తీసుకోలేదు. వాసన చూడలేదు. వాసన ఎక్కడ ఉంది. వాసన శరీరంలో లేదు. చైతన్యంలో అంతకన్న లేదు. వాసన మనస్సులో ఉంది. మనస్సు వాసనల సంపుటి. దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన అనే వాసనాత్రయమును త్యాగం చేయాలి. అంతరేంద్రియ నిగ్రహమే వాసనా రహితమునకు మార్గము. ఎవరైతే శబ్ద, స్పర్శ, రూప, రస, గంథాలను నిగ్రహించి, యింద్రియాలను అంతర్ముఖం చేస్తాడో వాడు ధీరుడు. తప్పక అమృతత్వాన్ని పొందుతాడు. ఇంద్రియాలు విషయాలకు స్వాధీనం

కాకూడదు. ఇంద్రియాలు మనస్సుకి, మనస్సు బుద్ధికి, బుద్ధి ఆత్మకి వశం అవ్వాలి. విషయాలు విషమని అందరికీ తెలుసు. విషయ భోగాలు రోగాలకి దారి తీస్తాయి. అయినా అలవాటు పడిన వాడికి రోగమే భోగం. ఇంద్రియాలు బందిపోటు దొంగలాగ నిదుర నుంచి లేపి స్వాధీనపరచుకుంటాయి. మిత ఆహారము, సాత్విక ఆహారము, మిత విహారము, ఆహార దోష నివృత్తి కలుగజేస్తాయి. జిహ్వేంద్రియము అదుపులో ఉంటే ఉపస్థ అదుపులో ఉంటుంది.

భీష్ములవారు అంపశయ్య మీద ఉండి పాండవులకు ధర్మాన్ని బోధిస్తున్న సమయంలో ద్రౌపది ప్రశ్నించింది "ఇన్ని ధర్మాలు యిప్పుడు బోధిస్తున్నావు, మరి ఆనాడు కౌరవ సభలో నన్ను వస్త్రాభహరణం చేస్తుంటే ధర్మాన్ని మరచి ఎందుకు ప్రవర్తించావు?" అని. "దుర్యోధనుని దుష్ట, నీచ భావనలతో అందజేసిన ఆహారం స్వీకరించటం వలన మనస్సు వికలమై అలా ప్రవర్తించాను" అన్నారు భీష్ములవారు.

శ్రవణం చేసే హక్కు మానవుడిదే. శ్రవణం ద్వారా ముక్తి కలుగుతుంది. ప్రపంచానికి అధిష్టానమైన చైతన్యం చెడిపోయేది కాదు. దాని గురించి శ్రద్ధగా, ప్రేమగా వినాలి. శ్రవణం శ్రద్ధగా చేస్తే తప్పక మననానికి వస్తుంది. మననము మనస్సు యొక్క చంచలత్వాన్ని తప్పక పోగొడుతుంది.

-సశేషం

***దాతవు నీకిచ్చేందుకు దయసంపూర్ణంగా ఉన్నా***
***రాత బాగులేని నాకరమ్ముల కందేది సున్నా!***

***తలుపులు మూసిన గదిలో వెలుగునే సూర్యుని కాంతులు?***
***తలపులు మూగిన మదిలో కనరారునే నీ సత్కృప?***

***ఆకువేసి తినమని నీవన్నీ వడ్డిస్తున్నా,***
***ఆకలింత లేనినాకు అంతా చీకాకే గద!***
***ఆకలవు, అన్నమివు, ఆది పెట్టే వాడనీవు***
***ఏకతమున నా తప్పని ఎంతునీవు గురుదేవా!***

-వి. వి. ఆర్ ప్రసాదరావు

# బెంగుళూరులో శ్రీ మాతాజీ సత్సంగం

(గతసంచిక తరువాయి) **సుందరకాండ** -రమణ ప్రసాద్

***కానివి పోనివి కర్మముల్ చేసి, కాలుని బారిని పడెదవేల రా!***
***కాళీ ప్రసాదుని హృదయ నివాసీ శ్రీమన్నారాయణ పాద ధ్యానము***
***మరువకుమురా మరువకుమురా ఇది నిక్కమురా***
***మాయా లోకమురా జీవా! మమతలలో పడెదవేలరా!***

ఎన్నో కోరికలతో జీవితం వృథాగా అయిపోతోంది. కాలునిబారిన పడకుండా ఉండాలంటే హరినామస్మరణ చేసి, కాలాన్ని నిక్షిప్తం చేసుకోవాలి. మనలను మనం ఉద్ధరించుకోవాలి.

***ఉద్ధరేదాత్మనాZZనం ఆత్మానమవసాదయేత్ ।***
***ఆత్మైవహ్యాత్మనో బంధుః ఆత్మైవ రిపురాత్మనః ॥***

అశోక వనంలో దుఃఖ సముద్రంలో మునిగి ఉన్న ఒక స్త్రీమూర్తిని చూసి, 'ఈమె మా అమ్మ సీతమ్మ అయి ఉండవచ్చు' అనుకొన్నాడు. ఇంతలో రావణుడు వచ్చి, ఒక నెల గడువు యిచ్చి వెళ్ళిపోయాడు. త్రిజట చెప్పింది "నాకు కల వచ్చింది. రావణుడు నల్లని బట్టలు ధరించి, దక్షిణ దిశగా వెడుతున్నట్లుగా, ఇది రావణ వినాశనానికి సంకేతం. ఈ సమయంలో వచ్చే కలలు నిజమవుతాయి" అన్నది.

హనుమంతుడు సూక్ష్మరూపంలో చెట్టుపైన ఉండి రామాయణ గాథను వినిపిస్తున్నాడు. సీతమ్మ యిది రాక్షసమాయ అని అనుకొన్నది. కాని అంతా పూసగుచ్చినట్లు చెబుతున్నాడు. కనుక రాముడు పంపగా వచ్చినవాడై ఉంటాడు అని అనుకొన్నది. హనుమంతుడు చెట్టు దిగి వచ్చి, సీతమ్మకు ప్రణామం చేసి, రామ సుగ్రీవుల మైత్రి గురించి చెప్పి, సీతాన్వేషణకై తాను వచ్చినట్లు చెప్పగా, సీత "నేను నిన్ను నమ్ముతాను నాయనా!" అన్నది. రామునితో ఒక్క నెల మాత్రమే గడువు ఉన్నదని, తను వచ్చి, రావణుని చంపి నన్ను తీసుకు వెళ్ళ"మని చెప్పింది. "అమ్మా! ఒక నెల ఎందుకు? నేనే నిన్ను రాముని వద్దకు చేరుస్తాను" అని తన నిజస్వరూపాన్ని చూపించాడు. రాముడు ఆనవాలు యిచ్చిన ముద్రికను సీతమ్మకు యిచ్చాడు.

"అమ్మను చూశాను. కాని రావణుని బలాబలాలను చూడకుండా వెళితే కార్యం పూర్తికానట్లే" అని సీత ఉన్న చెట్టు తప్ప అశోకవనం అంతటినీ ధ్వంసం చేశాడు. ఈ వార్త విన్న రావణుడు తన పుత్రుడైన అక్షయకుమారుణ్ణితో సైనికులను పంపుతాడు. వారందరినీ హతం చేశాడు. రావణుడు ఇంద్రజిత్తును పంపాడు. ఆంజనేయునిపై బ్రహ్మాస్త్రం సంధించాడు. ఆంజనేయుడు భక్తదురంధరుడు. బ్రహ్మాస్త్రాన్ని గౌరవించి దానికి కట్టుబడ్డాడు. రాక్షసులు తాళ్ళతో హనుమంతుని బంధించారు. ఎప్పుడైతే అలా తాళ్ళతో కట్టారో బ్రహ్మాస్త్రం విడిపోయింది. ఆంజనేయుని రావణుని సభకు తీసుకువెళ్ళి, 'ఎవరవురా నీవు?' అని అడిగాడు రావణుడు. 'నేను రాముని దూతను. సుగ్రీవుని మంత్రిని' అని చెప్పాడు. 'సుగ్రీవుడు వాలిని సంహరించాడు. ఇప్పటికైనా సీతని అప్పగించి రామునితో సంధిచేసుకో' అని హనుమంతుడు అన్న మాటకు కోపించి "ఇతడిని వధించండి" అని ఆజ్ఞాపిస్తాడు రావణుడు. దూతను చంపకూడదు" అని చెప్తాడు విభీషణుడు. 'వానరులకు తోకంటే ప్రీతి మెండు కాబట్టి ఆ తోకను కాల్చండి' అన్నాడు రావణుడు. హనుమంతుని తోకకు నిప్పంటిస్తారు.

హనుమంతునికి ఏ హానీ జరగకుండా చూడమని, అగ్నిదేవుణ్ణి ప్రార్థిస్తుంది సీతామాత. లంకాదహనం చేసి, సముద్రంలో తోకను చల్లార్చి సీత వద్దకు వచ్చి, "అమ్మా! నీ గుర్తుగా స్వామికి ఏమైనా ఇస్తావా?" అని అడిగాడు. తన వద్ద ఉన్న చూడామణిని యిచ్చింది. అమ్మ వద్ద శలవు తీసుకొని తిరిగి వచ్చిన మారుతికి ఆనందోత్సవాలతో వానరులు స్వాగతం పలికారు. మధువనంలో తియ్యటి ఫలాలతో విందు చేసుకున్నారు.

రామనామ ప్రభావంతో కార్యం నెరవేర్చి వచ్చిన హనుమంతుడు సీత క్షేమవార్త రామునికి చెప్పగా, రాముడు వెలలేని బహుమతి యిచ్చాడు. రాముడు హనుమంతుని ఆలింగనం చేసుకొన్నాడు. అదే వెలలేని బహుమతి. జీవబ్రహ్మైక్యానికి సంకేతం.

సమర్థ రామదాసు మనకి రామ నామ మంత్రం యిచ్చారు............ **శ్రీరామ జయరామ జయజయ రామ**. ఈ మంత్రాన్నిచ్చి జనులకు తరుణోపాయం చూపించారు సమర్థులు.

ఈ దేహం భగవంతుడు ప్రసాదించినది. లోపల చైతన్యం ఉంది. అది ఉంటేనే మనం జీవించగలుగుతున్నాము. అన్న విషయాన్ని గుర్తించాలి. చైతన్య రూపమైన ప్రాణం తప్పుకుంటే మనం ప్రేతలమే. ఈ సుందరకాండ కథను విన్నవారు, అన్నవారు అఖండ సుఖ శాంతులను పొందెదరు గాక!

అఖండ సాధనా సంపత్తిని, ఆత్మానందాన్ని శ్రీసద్గురుదేవులు ప్రసాదించెదరు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# నంబూరు యాత్ర

-వడ్లమన్నాటి శ్యామల

*(అందరూ తీర్థయాత్రలకు కాశి, రామేశ్వరాలు, ద్వారక,మధుర మొదలైన క్షేత్రాలకు వెళ్తారు. ఆయా క్షేత్రాలలో వారు పొందిన అనుభవాలను నెమరు వేసుకుంటారు. కాని ఈ భక్తురాలు నంబూరులోని కాళీవనాశ్రమ యాత్ర చేసి శ్రీ బాబూజీ, మాతాజీల దర్శనం చేసికొని తను పొందిన అనుభూతులను వివరిస్తోంది - ఎడిటర్*

నేను నంబూరు ఆశ్రమం గురించి నాకు తెలిసిన వాళ్ళద్వారా విన్నాను. అప్పటినుంచీ కుటుంబ సహితంగా అక్కడికి వెళ్ళాలని అనుకుంటున్నాము. అక్కడ దసరా ఉత్సవాలు, శ్రీబాబూజీ వార్షికోత్సవాలు బాగా జరుగుతాయని తెలిసి, నేను, మా వారు పిల్లతో కలిసి నంబూరు ఆశ్రమానికి బయల్దేరాము. దారి పొడుగునా అక్కడ జరిగే కార్యక్రమాలగురించి, శ్రీ బాబూజీ, శ్రీ మాతాజీ గురించి మేము విన్నవాటిని గుర్తు చేసుకుంటూ ప్రయాణం సాగించాం.అక్కడ జరిగే భజనలగురించి, ఆశ్రమం గురించి మా తోటి ప్రయాణీకులకు కూడా చెప్పాము.

రైలు విజయవాడ స్టేషన్‌కు చేరింది. మేము అక్కడ దిగి గుంటూరు వెళ్ళే బస్సు ఎక్కాం. దారిలో పానకాలస్వామి గుడి వచ్చింది. పానకాలస్వామికి నమస్కారం చేసుకున్నాం. బస్సు నంబూరు స్టేషన్ ఎదురుగా ఆగింది. ఇంతలో ఒక ఆటో అబ్బాయి వచ్చి మా సామాన్లు ఆటోలో పెట్టి "రండమ్మా! అన్నాడు. దారిలో బారులు తీరిన చెట్లు వాటినుండి రాలిన ఆకులు, " మీ పాపాలుకూడా ఆకులు రాలినట్లుగా రాలిపోతాయి. శ్రీ బాబూజీ సన్నిధికి వెళ్తున్నారు కదా! మీకు భక్తి జ్ఞాన వైరాగ్యాలు లభిస్తాయి'' అని చెప్తున్నట్లు అనిపించింది. ట్రస్ట్ హాస్పిటల్ వద్దకు చేరేసరికి 'మీ వసతికి ఏర్పాటు చేశాం రండి' అని భక్తులు వచ్చి, మా సామాన్లు తీసుకుని మాకు యిచ్చిన రూమ్‌కు చేర్చారు.

గేటులో కాలు పెట్టగానే పాటలు, ప్రవచనాలు వినిపిస్తున్నాయి. మాకు చెప్పనలవికాని ఆనందం కలిగింది. స్నానాలు చేసి, బాబూజీవారి దర్శనానికి వెళ్ళాము. అప్పుడు శ్రీమాతాజీ ప్రవచనం జరుగుతోంది. వారి అమృత వాక్కులు మనస్సుకు చక్కగా హత్తుకుపోయయి.

ప్రొద్దుటే సగర సంకీర్తన, ప్రార్థన, లలితాసహస్రనామ పారాయణలో

పాల్గొన్నా ం. తరువాత తీర్థ ప్రసాదాలు తీసుకున్నాము. ఆ ప్రసాదం ఎంత రుచిగా ఉన్నదంటే.............. ఏ అమ్మ కూడా అంత పొద్దునే రుచిగా వేడిగా చేసి పెట్టదు.

9గంటలకు మాతాజీవారు వస్తున్న సూచనగా టపాకాయలు పేల్చారు. బాజాభజంత్రీలు వెంటరాగా శ్రీమాతాజీ, శ్రీసద్గురుదేవుల పాదుకలు పట్టుకుని దీటుగా వస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూడటానికి రెండు కళ్ళూ చాలవు. మాతాజీవారు సంకీర్తన చేస్తూ అందరినీ చేతులు తడుతూ భజన చేయమని చెప్పారు. అలా చేస్తే పాపాలు ఎగిరిపోతాయి, చెడుపనులు చేసిన చేతులు పవిత్రతను పొందుతాయి అని చెప్పారు. మాతాజీవారు పాద నమస్కారాలు యిచ్చినప్పుడు అక్కడ లేవలేని వారికి చేయూతనిచ్చేవారు, నమస్కారాలు చేసుకునేవారి పిల్లలను ఎత్తుకుని సహకరించేవారు, మహాప్రసాద స్వీకరణలో బారులు తీర్చి కూర్చున్నవారికి ఆశ్రమ బాలబాలికలు తమ చిన్న చిన్న చేతులతో నీళ్ళు పోస్తూ, తమ సేవలను అందిస్తుంటే చూడముచ్చటగా ఉండేది.

ఒకరోజు మేము ఉన్నరూమ్‌లో నీళ్ళు రాలేదు. అక్కడ మాకు కృష్ణారావు (ముంబయి) కలిసి, ' మా యింటికి రండి' అని తీసెకెళ్ళారు. అప్పుడే దిగ్విజయ్ కుమార్, వారి సతీమణి పద్మతో పరిచయం అయింది. మేమందరం కలిసి దసరా కార్యక్రమాలలో పాల్గొన్నాము.

శ్రీమాతాజీవారి ప్రసంగం మమ్మల్ని ఎంతో ఆకట్టుకునేది. అప్పుడే అయిందా అనిపించేది. బృందావనం చుట్టూ ఎన్నో చెట్లు ఉన్నాయి. వాటి క్రింద కూర్చుంటే ఎంతో ప్రశాంత లభించేది. భోజనాల సంగతి యింక చెప్పనక్కర్లేదు. వివాహ భోజనం దానికి ఏమాత్రం సాటి రాదు. అది మహాప్రసాదం కదా!

అమ్మవారి నగర దర్శనం, సామూహిక కుంకుమ పూజలు వాటిల్లో పాల్గొని ఎంతో ఆనందం పొందాము. దీక్ష విరమణ తరువాత మాతాజీ' మీకేం దిగులు బంగారూ!?' అన్నట్లు అక్షతలు మా శిరస్సున వేసి, ఆశీర్వదించి పంపారు. అక్కడి నుండి కదలబుద్ధి కాలేదు. తిరిగి వస్తుంటే కనుల నీరు నిండింది. బాబూజీని మనతోనే ఉన్నారు కదా! అనే ధైర్యంతో తిరుగు ప్రయాణం చేశాము. ఈ నంబూరు యాత్రలో మేము అనేక దివ్యానుభూతులను పొందాము!!

*

(గతసంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

## 2. శ్రీ జయదేవుడు

మేము దయ తలిచి ఆయన కాళ్ళు చేతులు నరికి పాడుపడిన నూతిలో పారవేసివచ్చాము. ఆ సంగతి తెలిస్తే రాజుగారు ఎక్కడ దండిస్తారో అని విరక్తులమై దేశాటనం చేస్తూ మీ రాజ్యానికి వచ్చాం. శ్రీ జయదేవులు తనను మేము రక్షించిన ఉపకార స్మృతి చేత మాకు ఇట్టి సన్మానం చేయించారు.'' అని చెప్పారు.



ఈ అనృతం భరించజాలని భూదేవి రెండుగా చీలికలుకాగా ఈ వంచకులు తమ రథాలతో సహా ఆ పగుళ్ళలో దిగబడిపోయారు. రాజభటులు ఈ వృత్తాంతాన్ని రాజుకు, శ్రీ జయదేవులకు వివరించగా వారు అక్కడికి వచ్చారు. శ్రీజయదేవులు " ఓ జగదీశా! వీరిని రక్షింపుము'' అని ప్రార్థించారు. భూమిలో దిగబడిన ఆ కపట వేషధారులు దివ్య విమానారూఢులై అంతరిక్షానికి ఎగసి శ్రీ జయదేవులతో "ఓ మహానుభావా! మహాపరాధాలు చేసినా మేము మీ అనుగ్రహం చేత శ్రీ వైకుంఠానికి పోతున్నాము'' అని పలికి అంతర్ధానమైనారు.

రాజు ఎంతో ఆశ్చర్యపడి ఇంతకు ముందు జరిగిన వృత్తాంతమును చెప్పమని అడుగగా శ్రీజయదేవులచే ఆ వృత్తాంతాన్ని విని ఆనందపరవశులై, "దేశికోత్తమా! దేవరవారి కళత్రమును ఇచటకు తెచ్చి సేవించుకొనే భాగ్యాన్ని ప్రసాదించండి'' అని ప్రార్థించగా శ్రీజయదేవులు తన సమ్మతినితెలిపారు. రాజు సేనా సమేతుడై జగన్నాథ క్షేత్రానికి వెళ్ళి జయదేవుల పత్నియైన పద్మావతికి ప్రణమిల్లి ఆమెను తన రాజ్యానికి తీసికొని వచ్చాడు. అంత పద్మావతి తన నాథునకు వందనము చేసి భర్తృ వశవర్తియై ఉంటోంది. రాజు రాణితో " నీవు శ్రీ జయదేవుల పత్నియైన పద్మావతిని ఆరాధించ'' మని చెప్పాడు.

ఒకనాడు రాణి, పద్మావతి మాట్లాడుకుంటూఉండగా, ఒక సేవకుడు వచ్చి "మహారాణీ! నీ సోదరుడు పరలోకగతుడయినాడు. ఆయన భార్య సహగమనము చేసింది " అని చెప్పగా రాణి దుఃఖించుచుండగా పద్మావతి మౌనముగా ఉండుట చూసి, రాణి, " నాసోదరుని భార్య సహగమనము చేసిన వార్త వినికూడా నువ్వు నిర్లిప్తంగా ఉండుటకు కారణమే"మని అడిగెను. దానికి "పతివ్రత అయిన స్త్రీకి తన భర్త మరణించినంతనే శరీంవియోగము సంభవిస్తుంది. ప్రయత్నపూర్వకంగా సహగమనం చేయుటంలో ఆశ్చర్యమేమున్నది?" అని బదులు పలికింది.

రాణి పద్మావతి మాటలను అనుభవపూర్వకంగా పరీక్షించాలని నిశ్చయించుకొని తగు సమయానికై వేచి ఉండి, ఒకనాడు రాజు, శ్రీజయదేవులు వేటకు వెళ్ళిన సమయంలో ప్రధానిని రప్పించి " నీవు నీ బుద్ధి యుక్తులను ఉపయోగించి పద్మావతికి నమ్మకము కలిగేటట్లుగా 'శ్రీజయదేవులు పరంగతులైరి'అను వార్తను ఒక దూతచేత చెప్పించ"మని ఆజ్ఞాపించింది. అంత ప్రధాని పంపగా ఒక దూత వచ్చి పద్మావతి సమీపాన ఉన్న రాణికి నమస్కరించి " ఓ జననీ! రాజు, శ్రీ జయదేవులు అరణ్యామార్గాన పోతుండగా ఒక పులి శ్రీజయదేవులను హింసించింది" అని ఆనవాలుగా ఒక రక్త వస్త్రాన్ని చూపించాడు. రాజు భార్య కపటముగా ఏడవటం మొదలుపెట్టింది.

ఆ వృత్తాంతం చెవిన సోకినంతనే పతివ్రతా తిలకమైన పద్మావతి తన భర్తను స్మరిస్తూ భూమిపై పడి అసువులు బాసింది. రాణి భయంతో కంపించిపోయి కర్తవ్య విమూఢురాలైయింది. రాజు, శ్రీజయదేవులు పట్టణానికి తిరిగివచ్చి జరిగిన వృత్తాంతమును విన్న రాజు "ఈ అనర్థానికి హేతుభూతమైన నాకు స్త్రీ హత్యాదోషం వస్తుంది కనుక నేను ప్రాణత్యా.గం చేస్తాను" అని తన పుత్రుని పిలిచి ఉచిత ధర్మాలను బోధించి అగ్ని ప్రజ్వాలింపచేసి, శ్రీజయదేవులకు సాష్టాంగ ప్రణామములు చేసి "నేను మహా పాపిని. దేవరవారి ధర్మపత్నికి శరీరవియోగం సంభవించుటకు కారణభూతుడనైన నాకు అగ్ని ప్రవేశము తప్ప వేరే ప్రాయశ్చిత్తం లేదు." అని ప్రాయోపవేశానికి ఉద్యుక్తుడైయ్యాడు.

శ్రీజయదేవులు రాజు చేతిని పట్టుకొని " రాజా! నీవు శరీర త్యాగంచేయవద్దు." అని పద్మావతి నిర్యాణమైన చోటుకు వచ్చి శ్రీహరిని

ధ్యానించి హరినీ కీర్తిస్తూ ఇరవైనాలుగు అష్టపదులను పాడుతూ ఆనందపరవశులై నృత్యం చేసి శ్రీ జగన్నాధుని అబుద్ధిపూర్వకంగా సిద్ధించిన అపవాదమునుండి రక్షింప''మని ప్రార్థించాడు. భగవంతుడు ప్రత్యక్షమై జయదేవుని ఆలింగనము చేసికొని" భక్తాగ్రేసరా! నీ స్తోత్రమునకు పరవశుడనయినాను. నీవు పాడిన అష్టపదిని భక్తితో పఠించెడి వారిచెంత నేను లక్ష్మీ సమేతుడనై ఉంటాను" అనిఅనుగ్రహించి పద్మావతిని బ్రతికించి అంతర్ధానమయ్యాడు.

పద్మావతి పునర్జీవితురాలై భర్తకు ప్రదక్షిణ నమస్కారములు చేసి అంజలిహస్తయై ఉండగా దేవతలు పుష్పవర్షాన్ని కురిపించారు.

శ్రీజయదేవుడు శ్రీ కృష్ణుడిని శృంగారమూర్తిగా ఊహించి రచనలు చేశాడు. ఆయన తన గీతగోవిందంలో రాధాకృష్ణుల ప్రేమను అత్యద్భుతంగా వర్ణించాడు. హరినామం స్మరించుకోవాలనుకొనేవారికి తన కావ్యం ఉపయోగపడుతుంది అని తన కావ్యం మొదట్లో ఇలా అన్నాడు-

**యది హరి స్మరణే సరసం మనో**
**సది విలాసకలా సుకుతూహలమ్**
**మధుర కోమల కాంత పదావళీం**
**శృణుతదా జయదేవ సరస్వతీమ్**

" మీకు హరినామం స్మరించాలని నిజంగా కోరిక ఉంటే విలాసకళలో (శృంగారంలో) ఆసక్తి ఉంటే, వీనులకు విందు కలిగించే తీయనైన మాటలతో సంతరించబడిన జయదేవుని పాటలనే వినండి" ★

***కష్టాలు శాశ్వతం కావు. ఆకు రాలు వేళల్లో మోళ్ళయిన చెట్లు మధుమాసంలో చిగుర్చవూ?***
***గ్రీష్మంలో చిక్కే నదులు తొలకారులో బలం సంతరించుకోవూ?***

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL